CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 53 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 4 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 53 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 4 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# మరణ శాసనం రాసిందే కేసీఆర్

- అసెంబ్లీ సాక్షిగా ఒట్టేసి మరీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- తోలు తీస్తం.. బట్టలిప్పుతం అన్నోళ్లు ఎక్కడికి పోయిర్రు: కేసీఆర్‌కు సీఎం రేవంత్ కౌంటర్
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను: సభలో రేవంత్ రెడ్డి
- కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడారన్న ముఖ్యమంత్రి
- ఆయన చెప్పినందువల్లే నదీ జలాల అంశాన్ని చర్చకు పెట్టామని వెల్లడి
- రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** "నా ఆలోచన ఒక్కటే ఈ తెలంగాణ ప్రజలకు మేలు చేయాలి. చిన్న వయసులోనే దేవుడు నాకు ఒక గొప్ప అవకాశం ఇచ్చాడు. నా కంటే అర్హత, అనుభవం ఉన్న నాయకులు చాలామంది ఉన్నా దేవుడు నాకు గొప్ప అవకాశం ఇచ్చాడు. ఇది అషామాషీగా వచ్చే అవకాశం కాదు. ఇది నాకు దేవుడు ఇచ్చిన బాధ్యతగా భావిస్తున్నా. ఈ కుర్చీలో ఉన్నంతకాలం తెలంగాణకు నష్టం వచ్చే చిన్న పనికూడా చేయను. ఇది దేవుడి మీద ఆన. ఎవరో తాడు బొంగురం లేనోళ్లు మాట్లాడారని కాదు. నా బాధ్యతగా ప్రజలకు చెబుతున్నా. దేవుడి మీద ఆన, తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనివ్వను" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాట్లాడారు. శాసనసభలో నీళు –నిజాలు అంశంపై జరిగిన చర్చలో శనివారం సాయంత్రం ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు.

**నాలుక కోస్తా..**

తోలు తీస్తామంటూ నోటికొచ్చిన మాట్లాడితే నాలుక కోస్తామంటూ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. పాలమూరుకు అన్యాయం చేసింది గత ప్రభుత్వమేనని విమర్శించారు. ఆధారాలతో తాను మాట్లాడుతున్నానని అన్నారు. కృష్ణ జలాల విషయంలో మరణ శాసనం రాసిందే కేసీఆర్, హరీష్ రావులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో అనుభవం ఉన్న కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారనుకున్నానని, కానీ, సభకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నదీ జలాల గురించి మాట్లాడితే రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు చెబుతారని భావించామని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రెండేళ్లుగా సభకు రాకపోవటం విచారకరమని అన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అవమానించినా సరే కాంగ్రెస్ నేతలు సభకు వచ్చి మాట్లాడేవారని గుర్తుచేశారు. కృష్ణా జలాలపై చర్చను కేసీఆర్ తెరపైకి తెచ్చారని, కానీ వెంటనే అసెంబ్లీలో చర్చ చేపట్టామని, కానీ,

## తెలంగాణ నేల నాకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చింది

- పోరాట పటిమ, చైతన్యం, తెగింపు తెలంగాణ నుంచే వచ్చాయన్న పవన్ కల్యాణ్
- రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న పవన్ కల్యాణ్
- పోటీ చేయడం అలవాటు చేసుకోవాలని జనసైనికులకు సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ప్రసాదిం చిందని, ఈ ప్రాంత ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత

వివరాలు 2లో..



## నటుడు విజయ్, రాహుల్ గాంధీ మంచి మిత్రులు

### టీవీకే పార్టీ అధికార ప్రతినిధి

- టీవీకే, కాంగ్రెస్ కూటమి పొత్తుకు సంకేతాలు ఇచ్చిన అధికార ప్రతినిధి
- మతతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో రెండు పార్టీల విధానాలు ఒకేలా ఉంటాయని వ్యాఖ్య
- ఆ కోణంలో కాంగ్రెస్, టీవీకే భాగస్వాములన్న ఫెలిక్స్ గెరాల్డ్

వివరాలు 2లో..

## రోడ్డు విస్తరణలో మా మామ ఇంటినే తొలగించాం



- కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో తెలిపిన కేంద్రమంత్రి
- తన కుక్‌తో కలిసి ఢిల్లీలోని గడ్కరీ ఇంటికి వెళ్లిన ఫరా ఖాన్
- తన మామకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం మాత్రమే ఇచ్చినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** తంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన ప్పుడు అడ్డుగా ఉన్న తన సొంత మామ ఇంటిని సైతం తొలగించినట్లు కేంద్ర

వివరాలు 2లో..

## అసెంబ్లీలో కునుకు తీసిన బీజేపీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కృష్ణానది జలాలు, పాలమూరు ప్రాజెక్టుపై ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓవైపు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తుండగా..బీజేపీ ఎమ్మెల్యేలు హాయిగా గాఢ నిద్రలోకి జారుకున్నారు. ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావుపాటిల్ కునుకు తీయడం చర్చనీయాం శంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి కేటాయింపులపై బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని, శ్రీశైలం నుంచి ఏపీ ఏవిధంగా నీళ్లను అక్రమంగా తరలించిందో..ఆధారాలు, జీవోలతో సహా ఉత్తమ్ అసెంబ్లీలో

వివరాలు 2లో..

## రూ.35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా




- కూకట్‌పల్లిలో కబ్జాదారుల నుంచి 3 వేల గజాల భూమిని కాపాడిన హైడ్రా
- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు
- రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో కబ్జాకు గురైన సుమారు రూ. 35 కోట్ల విలువైన పార్కు స్థలాలను హైడ్రా అధికారులు కాపాడారు. మొత్తం 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కుల

వివరాలు 2లో..

### వెనెజులాపై అమెరికా దాడి...

## భగ్గుమన్న రష్యా, ఇరాన్, క్యూబా



- వెనెజులాపై అమెరికా భారీ సైనిక దాడి, అధ్యక్షుడు మదురో నిర్బంధం!
- ఇది సార్వభౌమాధికారంపై దాడిగా అభివర్ణించిన పలు దేశాలు
- అమెరికా చర్యను తీవ్రంగా ఖండించిన రష్యా, ఇరాన్, క్యూబా
- వెంటనే ఐరాస భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్
- వెనెజులా ప్రజలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేసిన రష్యా

వివరాలు 2లో..

## సూర్యాపేట జిల్లాలో 'జనంబాట'.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కవిత విమర్శలు

- తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని ఆగ్రహం
- ముఖ్యమంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీత
- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని వ్యాఖ్య


**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జనంబాట'లో భాగంగా ఆమె సూర్యాపేట జిల్లాలో పర్యటించారు.



వివరాలు 2లో..

### ఆకాశంలో అద్భుతం..2026లో

## కనువిందు చేసిన తొలి సూపర్‌మూన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆకాశంలో అద్భుతం.. చందమామ జిగేల్ మంటూ వెలుగులు చిమ్ముతూ చూసేవారిని అబ్బురపర్చాడు. సాధారణ పౌర్ణమికంటే పెద్దదిగా, ప్రకాశవంతంగా చంద్రుడు కనిపించాడు. దేశవ్యా ప్తంగా పలు నగరాల్లో ఆకాశంలో సూర్యాస్తమయం తర్వాత ప్రకాశవంతంగా, పెద్దగా దర్శనమిచ్చాడు. 2026లో తొలిసారి స్కైవాచర్లకు కనువిందు చేశాడు సూపర్ మూన్. వోల్ఫ్ పౌర్ణమి సందర్భంగా

వివరాలు 2లో..

## జనవరి 6న నుమాయిష్ లేడీస్ స్పెషల్




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ఉండే మహిళలకు గుడ్ న్యూస్. నాంపల్లిలో జరిగే నుమాయిష్ లో జనవరి 6న కేవలం మహిళలను మాత్రమే అనుమతించనున్నారు. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (ూ××జు) ప్రతి ఏటా మహిళల కోసం లేడిస్ డే స్పెషల్ ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సారి కూడా జనవరి 6న మంగళవారం (ఖుఒఱవం ఋఎ ఎవశ్రీవఎతీఫ్ఱశీఅం 2026) లేడిస్ స్పెషల్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఆ రోజు పదేళ్ల కంటే ఎక్కువ వయసున్న అబ్బాయిలను ఎగ్జిబిషన్ లోకి అనుమతించరు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4:30 గంటల నుంచి వేడుకలు జరుగుతాయి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్ జోన్) డాక్టర్ కె శిల్పవల్లి ముఖ్య అతిథిగా హాజరవుతారు.మహిళల కోసం ప్రత్యేక రోజును కేటాయించాలని 1940లో ఏడవ నిజాం

వివరాలు 2లో..

### కొనసాగుతున్న మరో ఎన్ కౌంటర్...

## 12 మంది మావోయిస్టుల మృతి

- దక్షిణ బస్తర్ జిల్లా అడవుల్లో కాల్పుల మోత
- ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన కాల్పులు
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై భద్రతా బల గాలు విరుచుకుప డుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ అటవీ ప్రాం తంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు హతమ య్యారు. ఈ ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందడంతో

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# హిప్నాటిజం శాస్త్రీయ ప్రయాణం

ప్రపంచ వ్యాప్తంగా మానవ మనస్సు శక్తిపై శాస్త్రీయ అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ హిప్నాటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనిషి ఆలోచనలు, భావాలు, ప్రవర్తనల వెనుక పనిచేసే అవచేతన శక్తిని గుర్తించి, దాన్ని సానుకూల మార్పులకు వినియోగించు కోవచ్చనే భావనను సమాజానికి చేర వేయడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. సాధారణంగా హిప్నాటిజం అంటే మాయాజాలం, వశీకరణ, లేదా వేదికలపై చేసే వినోద కార్యక్రమాలుగా ప్రజల్లో అపోహలు ఉన్నాయి. అయితే ఆధునిక మానసిక శాస్త్రం స్పష్టంగా నిర్ధారించిన వాస్తవం ఏమిటంటే?హిప్నాటిజం అనేది పూర్తిగా శాస్త్రీయమైన మానసిక స్థితి, ఇందులో వ్యక్తి అప్రమత్తంగానే ఉండి, అత్యంత ఏకాగ్రతతో తన అవచేతన మనస్సుపై దృష్టి కేంద్రీకరిస్తాడు. హిప్నాటిజం చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే, ఇది ఆధునిక కాలానికి చెందిన ప్రక్రియ మాత్రమే కాదని తెలుస్తుంది. భారతీయ యోగ, ధ్యాన సంప్రదాయాల్లో కనిపించే ధారణ, ధ్యానం, సమాధి వంటి భావనలు హిప్నాటిక్ స్థితికి సమీపంగా ఉంటాయి. ఉపనిషత్తులు, యోగసూత్రాలు మనస్సు నియంత్రణ ద్వారా శరీర?మనో సమతుల్యత సాధించవచ్చని పేర్కొన్నాయి. ప్రాచీన ఈజిప్ట నాగరికతలో దేవాలయాల్లో 'స్లీప్ టెంపుల్స్' అనే విధానం ద్వారా మానసిక, శారీరక సమస్యలకు చికిత్స చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. గ్రీకు వైద్యుడు హిపోక్రటీస్ కూడా మనస్సు ఆరోగ్యం శరీర ఆరోగ్యానికి కీలకమని వివరించాడు. ఆధునిక హిప్నాటిజానికి పునాది వేసినవారిగా 18వ శతాబ్దానికి చెందిన ఫ్రాంజ్ ఆంటన్ మెస్మర్ పేరు ప్రాధాన్యంగా చెప్పుకోవాలి. ఆయన ప్రతిపాదించిన 'మెస్మరిజం' సిద్ధాంతం తొలుత వివాదాస్పదమైనప్పటికీ, తదుపరి కాలంలో శాస్త్రీయ పరిశోధనలకు దారి చూపింది. 19వ శతాబ్దం చివరి నాటికి హిప్నాటిజం వైద్య, మానసిక శాస్త్ర రంగాల్లో అధ్యయన అంశంగా మారింది. సిగ్మండ్ ఫ్రాయిడ్ తన ప్రారంభ దశలో హిప్నాసిస్‌ను ఉపయోగించి మానవ అవచేతనాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. తరువాత కాలంలో క్లినికల్ సైకాలజీ, న్యూరోసైన్స్ రంగాల్లో జరిగిన పరిశోధనలు హిప్నాటిక్ స్థితిలో మెదడులో జరిగే మార్పులను స్పష్టంగా నిరూపించాయి. మెదడు తరంగాల్లో ఆల్ఫా, థీటా తరంగాలు పెరగడం, ఒత్తిడి హార్మోన్లు తగ్గడం వంటి అంశాలు ప్రయోగాల ద్వారా వెల్లడయ్యాయి. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ ప్రకారం, సాధారణ జనాభాలో సుమారు 10 నుంచి 15 శాతం మంది హిప్నాటిజానికి అత్యంత స్పందన చూపిస్తే, 60 నుంచి 70 శాతం మంది మోస్తరు స్థాయిలో స్పందిస్తారు. ఆధునిక వైద్యరంగంలో హిప్నాటిజం ఒక సహాయక చికిత్సా పద్ధతిగా గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాలు దీర్ఘకాలిక నొప్పి నియంత్రణలో హిప్నోథెరపీ 30 నుంచి 50 శాతం వరకు ఉపశమనాన్ని ఇస్తుందని సూచిస్తున్నాయి. పొగత్రాగడం మానేయడంలో, బరువు నియంత్రణలో, ఆందోళన రుగ్మతలు, భయాలు, నిద్రలేమి వంటి సమస్యల్లో హిప్నాటిజం ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని యూరోపియన్ దేశాల్లో దంత చికిత్సల సమయంలో నొప్పి నివారణకు హిప్నాటిక్ పద్ధతులు వినియోగిస్తున్నారు. అమెరికాలో ప్రతి సంవత్సరం వేలాది మంది లైసెన్స్ పొందిన హిప్నోథెరపిస్టుల ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం సందర్భంగా ప్రధానంగా చెప్పాల్సిన అంశం?హిప్నాటిజం ద్వారా వ్యక్తి తన నియంత్రణ కోల్పోతాడన్న భ్రమ పూర్తిగా తప్పు. హిప్నాటిక్ స్థితిలో ఉన్న వ్యక్తి తన విలువలకు, నైతికతకు విరుద్ధమైన పనులు చేయడు. ఇది బలవంతపు ప్రక్రియ కాదు; పరస్పర సహకారంపై ఆధారపడిన మానసిక విధానం. హిప్నోటిస్ట్ సూచనలు ఇస్తాడు కానీ వాటిని అంగీకరించాలా వద్దా అన్న నిర్ణయం వ్యక్తిదే. అందుకే శాస్త్రీయ హిప్నాటిజాన్ని వినోద ప్రదర్శనలతో సమానంగా చూడటం తగదు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య నిపుణులు హిప్నాటిజం ఉపయోగాలు, పరిమితులు, నైతిక ప్రమాణాలపై ప్రజలకు వివరిస్తారు. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యల నేపథ్యంలో అవచేతన శక్తిని సానుకూలంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. భారతదేశంలో హిప్నాటిజంపై ఆసక్తి క్రమంగా పెరుగుతున్నా, సరైన నియంత్రణ, శాస్త్రీయ అవగాహన లోపిస్తున్నాయి. అర్హత లేని వ్యక్తులు చేసే ప్రదర్శనలు హిప్నాటిజంపై అపోహలను మరింత బలపరుస్తున్నాయి. అందుకే హిప్నాటిజాన్ని వైద్య, మానసిక చికిత్సల కోసం వినియోగించేటప్పుడు శిక్షణ పొందిన, లైసెన్స్ ఉన్న నిపుణుల సేవలు తీసుకోవడం అత్యవసరం. ప్రభుత్వం, వైద్య మండళ్లు ఈ రంగంపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం మనిషి అంతర్గత శక్తిని గుర్తు చేసే ఒక ఆలోచనాత్మక సందర్భం. మనస్సు అనేది కేవలం ఆలోచనల సమాహారం కాదు, అపార సామర్థ్యాల నిలయం. ఆ సామర్థ్యాన్ని భయం లేకుండా, అపోహలు తొలగించి, శాస్త్రీయ దృష్టితో వినియోగించుకుంటే వ్యక్తిగత ఆరోగ్యం మెరుగు పడుతుంది, సమాజం మానసికంగా మరింత బలపడుతుంది. అవచేతనాన్ని అర్థం చేసుకోవడం ద్వారా స్వీయ అవగాహనకు దారి తీసే ఈ ప్రయాణానికి ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం ఒక ప్రేరణగా నిలుస్తోంది.

# తెలంగాణ నేల నాకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చింది

- మొదటి పేజీ తరువాయి

పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం జగిత్యాల జిల్లాలో నిర్వహించిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన రాజకీయ జీవితంలో పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయని ఆయన అన్నారు.(రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పోటీ చేయడం మాత్రం అలవాటు చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమికి భయపడకుండా పోటీ చేసే మనస్తత్వం జనసేనలో పెరగాలని సూచించారు. పోటీ పడినప్పుడే అనుభవం వస్తుందని, ప్రజల మధ్య ఉండగలమని అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఎవరూ శత్రువులు కాదని ఆయన స్పష్టం చేశారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని, విధానాలపైనే అని అన్నారు.ప్రజా ప్రయోజనాల కోసం, సరైన విధానాల కోసం మాత్రమే జనసేన రాజకీయాల్లో పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జన సైనికుడిపై ఉందని అన్నారు. వంద మైళ్ల దూరం కూడా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని గుర్తుంచుకోవా

లని హితవు పలికారు.జనసేన ప్రయాణం ఇప్పుడు బలంగా మొదలైందని, ముందున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తల సమావేశంలో ఆయన సూచించారు. అంజన్న సన్నిధి తనను కాపాడిందని పవన్ కల్యాణ్ అన్నారు. కష్టకాలంలో ఆధ్యాత్మిక బలం తనకు అండగా నిలిచిందని ఆయన అన్నారు.

# నటుడు విజయ్, రాహుల్ గాంధీ మంచి మిత్రులు

తమ పార్టీ అధినేత, నటుడు విజయ్, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మంచి మిత్రులని టీవీకే పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ తెలిపారు. రానున్న తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో టీవీకే, కాంగ్రెస్ కూటమి ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయని, ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేతలతో టీవీకే అధ్యక్షుడు విజయ్ చర్చిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తుకు సంకేతాలు ఇచ్చారు. లౌకికవాదం, మతతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో టీవీకే, కాంగ్రెస్ పార్టీ విధానాలు ఒకే విధంగా ఉంటాయని అన్నారు. ఆ కోణంలో చూస్తే తాము భాగస్వాములమని అన్నారు. విజయ్, రాహుల్ గాంధీ కూడా మంచి మిత్రులని పేర్కొన్నారు. కాంగ్రెస్, టీవీకే పొత్తుకు చాలా

అవకాశాలు ఉన్నప్పటికీ, ఇరువర్గాలు కొన్ని విషయాలపై చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు.

పొత్తు ప్రతిష్ఠంభనకు తమిళనాడు కాంగ్రెస్ పార్టీయే కారణమని అన్నారు. ఇక్కడి నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో కలవడానికి వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఇరుపార్టీల మధ్య పొత్తు కుదిరితే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపాడుకోవచ్చని అన్నారు.

# వెనెజులాపై అమెరికా దాడి... భగ్గుమన్న రష్యా, ఇరాన్, క్యూబా

వెనెజులాపై అమెరికా శనివారం భారీ సైనిక దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించి దేశం నుంచి తరలించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ప్రకటించారు. అమెరికా చేపట్టిన ఈ చర్యను రష్యా, ఇరాన్, క్యూబాతో సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది వెనెజులా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను దారుణంగా ఉల్లంఘించడమేనని మండిపడ్డాయి.అమెరికా చర్య తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "ఇలాంటి చర్యలను సమర్థించుకోవడానికి ఉపయోగించే సాకులు నిలకడలేనివి. కేవలం సైద్ధాంతిక శత్రుత్వం వల్లే ఈ దాడి జరిగింది. లాటిన్ అమెరికా శాంతి క్షేత్రంగానే ఉండాలి. వెనెజులా తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే హక్కుకు హామీ ఇవ్వాలి. వెనెజులా ప్రజలకు మా సంఘీభావం ఉంటుంది" అని రష్యా స్పష్టం చేసింది. ఈ అంశంపై తక్షణమే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేయాలన్న వెనెజులా డిమాండ్‌కు రష్యా మద్దతు ప్రకటించింది.మరోవైపు, క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్-కెనెల్ ఈ దాడిని 'నేరపూరిత చర్య'గా అభివర్ణించారు. ఇది వెనెజులా ధైర్యవంతులైన ప్రజలపై జరుగుతున్న 'అగ్రరాజ్య ఉగ్రవాదం' అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ కూడా అమెరికా చర్యను పిరికిపంద చర్యగా ఖండించారు.ఇరాన్ విదేశాంగ శాఖ కూడా అమెరికా దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది దురాక్రమణ చర్య అని, ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రాథమిక సూత్రాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. తన సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునే హక్కు వెనెజులాకు ఉందని, అమెరికా 'దండయాత్ర'ను తక్షణమే ఆపడానికి అంతర్జాతీయ సమాజం తన చట్టపరమైన, నైతిక బాధ్యతను నెరవేర్చాలని ఇరాన్ పిలుపునిచ్చింది.

# రూ.35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- మొదటి పేజీ తరువాయి

స్థలాలను శనివారం స్వాధీనం చేసుకుని, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.కూకట్‌పల్లి భాగ్యనగర్ ఫేజ్3 కాలనీలోని పార్కులు ఆక్రమణకు గురయ్యాయని అక్కడి సంక్షేమ సంఘం సభ్యులు 'ప్రజావాణి'లో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు.సర్వే నంబర్లు 197, 200 పరిధిలో 1987లో హుడా అనుమతితో భాగ్యనగర్ ఫేజ్-3 లేఅవుట్ ఏర్పడింది. ఇందులో రెండు స్థలాలను పార్కుల కోసం కేటాయించారు. అయితే, 2 వేల గజాల పార్కులో సగం స్థలం, ఎకరం విస్తీర్ణంలోని మరో పార్కులో వెయ్యి గజాల స్థలం కబ్జాకు గురైనట్లు అధికారులు తమ నివేదికలో గుర్తించారు.ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ ఆదేశాలతో శనివారం ఆక్రమణలను తొలగించారు. ఖాళీ చేయించిన స్థలంలో 'హైడ్రా' బోర్డులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు. తమ కాలనీలోని విలువైన పార్కు స్థలాలను కాపాడినందుకు స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జనవరి 6న నుమాయిష్ లేడీస్ స్పెషల్

- మొదటి పేజీ తరువాయి

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారని చెబుతారు.హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 85వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ 'నుమాయిష్ ను జనవరి 1న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రారంభించారు.జనవరి1 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఈ నుమాయిష్ ఎగ్జిబిషన్ జరగనుంది. దేశ నలుమూలల నుంచి రకరకాల సంప్రదాయాలకు చెందిన కళాకృతులు ఇక్కడ కొలువు దీరుతున్నాయి. ఈ సారి నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో 1050 స్టాళ్లు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్నచిన్న, మధ్య తరహా, మైక్రో ఇండస్ట్రీలకు సంబంధించిన ఉత్పత్తుల స్టాల్స్ ఇందులో ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన హస్తకళలు, దుస్తులు, గృహోపకరణాలు, ఆభరణాలు, డ్రై ఫ్రూట్స్ వంటి వస్తువులు అందుబాటులో ఉంటాయి.ఖనుమాయిష్ ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే వారి కోసం టీజీఎస్‌ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. పారిశ్రామిక ప్రదర్శనగానే కాకుండా దేశం నలుమూలల నుంచి రకరకాల సంప్రదాయాలకు చెందిన కళాకృతుల స్టాల్స్ తో ఆయా రాష్ట్రాల సంస్కృతుల సమ్మేళన వేదికగా నిలుస్తుంది.ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 వరకు, వీకెండ్, హాలిడేస్‌లో రాత్రి 11 గంటల వరకు నుమాయిష్ తెరిచి ఉంటుంది. ఎంట్రీ ఫీజు రూ. 50 కాగా, ఐదేండ్లలోపు చిన్నారులకు ఉచిత ప్రవేశం కల్పిస్తోంది ప్రభుత్వం. నుమాయిష్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 19 విద్యా సంస్థలను నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయనున్నారు.

# అసెంబ్లీలో కునుకు తీసిన బీజేపీ ఎమ్మెల్యేలు

- మొదటి పేజీ తరువాయి

వివరించారు. పదేళ్లలో కేసీఆర్ తెలంగాణకు చేసిన ద్రోహంపై సీరియస్ గా డిస్కషన్ జరుగుతుంటే బీజేపీ ఎమ్మెల్యేలు హాయిగా కునుకు తీసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏపీ అక్రమంగా 1200 టీఎంసీలు తరలింపు**

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో ఏపీ అక్రమంగా 1200టీఎంసీలు తరలించుకుపోయిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కృష్ణా జలాలపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా.. రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు ఆనాడు జగన్ కు సహకరించింది కేసీఆరేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ఆపించిన ఘనత కాంగ్రెస్ కే దక్కుతుదన్నారు ఉత్తమ్. కృష్ణా నీటి వాటాలో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసి తెలంగాణకు మరణ శాసనం రాశారని ఫైర్ అయ్యారు ఉత్తమ్. కృష్ణానదిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పదేళ్లలో ఏపీ రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం రోజుకు 3టీఎంసీలు వాడుకుంటుంటే బీఆర్ ఎస్ ప్రభుత్వం సైలెంట్ గా ఉందని తెలిపారు ఉత్తమ్. కృష్ణా నీటి వాటాలో తెలంగాణకు కేటాయించిన వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని చెప్పారు. కృష్ణా జలాల వినియోగంలో రైతులు ఎక్కువగా వినియోగించుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనేనని తెలిపారు.

# రోడ్డు విస్తరణలో మా మామ ఇంటినే తొలగించాం

- మొదటి పేజీ తరువాయి

మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. పని విషయంలో తనకు అందరూ సమానమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో కేంద్రమంత్రి ఈ విషయాలు తెలిపారు. తన కుక్ దిలీప్‌తో కలిసి ఫరా ఖాన్ ఢిల్లీలోని గడ్కరీ నివాసాన్ని సందర్శించారు. గడ్కరీ తన భార్య కాంచన్‌తో కలిసి ఫరా ఖాన్ వ్లాగ్‌లో పాల్గొన్నారు.

తన గ్రామంలో రోడ్డు వేయాలని ఫరా ఖాన్ కుక్ దిలీప్ వ్లాగ్‌లో కేంద్రమంత్రిని అభ్యర్థించారు. దీంతో అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయాలని ఫరా ఖాన్ చమత్కరించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కాంచన్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటిని గడ్కరీ కూల్చివేశారని వెల్లడించడంతో వారంతా ఆశ్చర్యపోయారు.

మీ మామకు కొత్త ఇల్లు కట్టించి ఇచ్చారా అని ఫరా ఖాన్ గడ్కరీని అడగగా, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తన మామ ఇంటిని కూల్చివేయవలసి వచ్చిందని ఆయన బదులిచ్చారు. ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే పరిహారం అందేలా చూశామని చెప్పారు.

# కొనసాగుతున్న మరో ఎన్ కౌంటర్... 12 మంది మావోయిస్టుల మృతి

- మొదటి పేజీ తరువాయి

డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో అటవీ ప్రాంతంలో దాగి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రతా బలగాలు కూడా వెంటనే ప్రతిస్పందించడంతో రెండు వైపులా ఎదురుకాల్పులు జరిగాయి.కాల్పులు ముగిసిన తర్వాత ఆ ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టిన భద్రతా బలగాలకు 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉండే అవకాశముందని భావిస్తున్న భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. జవాన్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఎన్‌కౌంటర్ జరిగిన కచ్చితమైన ప్రదేశాన్ని అధికారులు ప్రస్తుతం బయటకు వెల్లడించలేదు. పూర్తి వివరాలు గాలింపు చర్యలు ముగిసిన తర్వాత వెల్లడించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# ఆకాశంలో అద్భుతం..2026లో కనువిందు చేసిన తొలి సూపర్‌మూన్

- మొదటి పేజీ తరువాయి

కనిపించే ఈ సూపర్ మూన్ వోల్ఫ్ మూన్ అని కూడా అంటారు. సాధారణ పౌర్ణమికంటే పెద్దదిగా, ప్రకాశవంతంగా కనిపించింది. ఈ ఏడాది సాధారణ పౌర్ణమి కంటే దాదాపు 30 శాతం ప్రకాశవంతంగా , దాదాపు 14 శాతం పెద్దదిగా కనిపించాడు. చాలా మంది స్కైవాచర్లు ఎటువంటి ప్రత్యేక పరికరాలు లేకుండా దృశ్యాన్ని ఆస్వాదించారు. గౌహతిలో చంద్రుడు వెచ్చని నారింజ-పసుపు రంగులో తక్కువ ఎత్తులో కనిపించాడు. భువనేశ్వర్, కోల్ కతా, లక్నోలలో కూడా ఇదే దృశ్యం కనిపించింది. అక్కడ ప్రజలు ప్రకాశించే చంద్రుని ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. జనవరి నెలలో వచ్చే పౌర్ణమి చంద్రుడిని వోల్ఫ్ మూన్ అని పిలుస్తారు. ఉత్తరాది జానపద కథల నుంచి ఈ పేరు వచ్చింది. అక్కడ ప్రజలు దీర్ఘ శీతాకాలపు రాత్రులలో తోడేళ్ళు ఎక్కువగా అరుస్తాయని నమ్ముతారు. చంద్రుడిని కొన్నిసార్లు యూల్ తర్వాత చంద్రుడు అని కూడా పిలుస్తారు.సూపర్ మూన్ ను కంటితో చూడొచ్చు. అయితే బైనాక్యులర్లు, చిన్న టెలిస్కోప్ లను ఉపయోగించి చూస్తే చంద్రుని ఉపరితలం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అక్టోబర్ లో ప్రారంభమై నాలుగు నెలలు సాగిన సూపరమూన్ పరుగుకు సూపర్మూన్ ముగింపు పలికింది. ఇలాంటి అద్భుత దృశ్యాలను చూడాలంటే.. 2026 చివరి వరకు వేచి చూడాల్సిందే.

# మరణ శాసనం రాసిందే కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి

సభకు రాలేదని విమర్శనాస్త్రాలు సంధించారు.

**మరణ శాసనం రాసిందే బీఆర్ఎస్**

బచావత్ ట్రిబ్యునల్ (KWDT`1)అవార్డు ప్రకారం కృష్ణాజలాల్లో 75 శాతం నీటిలభ్యత అంచనాల ప్రకారం మొత్తం 2,130 టీఎంసీల నీటిని కేటాయించారని రేవంత్ రెడ్డి అన్నారు. "కేంద్రంతో జరిగిన సమావేశాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు పెట్టారు. పాత ఒప్పందమే శాశ్వతంగా ఉండేలా సంతకం చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని జీవోలు ఉన్నాయి. 811 టీఎంసీలలో మాకు 490 టీఎంసీలు ఇవ్వాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం వద్ద వాదించాల్సిన కేసీఆర్, హరీష్ రావు.. మన హక్కులను శాశ్వతంగా ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టారు. ఇందుకోసం 2015లో సంతకం పెట్టారు. అలా సంతకం చేసి తెలంగాణకు మొదటి మరణశాసనం రాశారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీలో గత పదేళ్ల కాలంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, పాలమూరుకు అనుమతి ఇవ్వాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేశారు.

# సూర్యాపేట జిల్లాలో 'జనంబాట'.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కవిత విమర్శలు

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆమె ఆరోపించారు. తన పర్యటనలో భాగంగా ఆమె వివిధ వర్గాల ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిలో తాను ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై దృష్టి సారించానని ఆమె అన్నారు. అర్వపల్లి మండలంలోని కేజీవీబీ స్కూల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. గత ఏడాది తుపాను వచ్చి పాఠశాల మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు

# జన్నారం పోలీసుల 'పెద్ద మనసు'..!

## మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థికంగా భరోసా..!



**బ్యూరో రిపోర్ట్, పెన్ పవర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనవరి 3:** జన్నారం మండలంలోని పోలీసులంటే కేవలం శాంతిభద్రతలు కాపాడటమే కాదు, కష్టాల్లో ఉన్న తోటివారికి కన్నీరు తుడిచే 'కన్నబిడ్డలు' అని జన్నారం పోలీసులు నిరూపించారు. విధి నిర్వహణలో నిరంతరం అలసిపోని సైనికుడిలా పనిచేస్తూ, ఇటీవల కన్నుమూసిన హోంగార్డు రాములు కుటుంబానికి తామున్నామంటూ ఖాకీలు భరోసా ఇచ్చారు.. బంధువుల కంటే ముందే స్పందించిన 'బలగం' ఒక సామాన్య హోంగార్డుగా రాములు చేసిన సేవలను జన్నారం పోలీస్ స్టేషన్ మర్చిపోలేదు. ఆయన మరణం ఆ కుటుంబంలో నింపిన చీకట్లను చూసి తోటి సిబ్బంది చలించిపోయారు. ఎస్సై గొల్లపల్లి అనూష గారి నేతృత్వంలో స్టేషన్‌లోని ప్రతి ఉద్యోగి తమ సొంత కుటుంబ సభ్యుడి కోసం స్పందించినట్లుగా స్పందించారు. అందరూ కలిసి సేకరించిన రూ. 30,000 ఆర్థిక సహాయాన్ని రాములు కుటుంబానికి అందజేసి, 'మేమున్నం.. అధైర్య పడకండి' గుండె నిబ్బరాన్ని ఇచ్చారు.ఖచ్చితమైన కర్తవ్యం.. అంతకు మించిన కమ్మని ప్రేమ ఈ సందర్భంగా ఎస్సై గొల్లపల్లి అనూష మాట్లాడుతూ.. రాములు క్రమశిక్షణ కలిగిన ఉద్యోగి మాత్రమే కాదని, స్టేషన్‌లో అందరితో ఎంతో ఆత్మీయంగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. "డ్యూటీలో ఉన్నప్పుడు కఠినంగా కనిపించినా, తోటి సహచరుడి కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే చూస్తూ ఊరుకోలేము. ఇది మా బాధ్యత," అని ఆమె పేర్కొన్నారు.. సమాజానికి ఒక సందేశం ఈ ఘటన కేవలం ఒక ఆర్థిక సహాయంగా మాత్రమే కాకుండా, పోలీస్ శాఖలో ఉండే ఐక్యతకు మరియు మానవత్వానికి నిలువుటద్దంగా నిలిచింది. కష్టాల్లో ఉన్నప్పుడు కులమతాలకు అతీతంగా, కేవలం 'మా తోటి వ్యక్తి' అనే భావనతో జన్నారం పోలీసులు చేసిన ఈ పని ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అందరూ జన్నారం పోలీసుల ఉదారతను వేనోళ్ల కొనియాడుతున్నారు.

# పెన్ పవర్




# అడవిని నమిలేస్తున్న 'ఇసుక' మాఫియా..

## అదిలాబాద్ జన్నారం అడవుల్లో ఫారెస్ట్ అధికారుల మెరుపు దాడి..!

## వన్యప్రాణుల ఆవాసాల్లో అక్రమార్కుల తవ్వకాలు రెండు ట్రాక్టర్లు సీజ్..




ఫారెస్ట్ అధికారులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు..




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, ఉమ్మడి అదిలాబాద్ జనవరి 3:**జన్నారం అటవీ ప్రాంతంలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సాగుతున్న అక్రమ రవాణా దందాను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, అత్యంత రక్షణగా ఉన్న 'ఎకో సెన్సిటివ్ జోన్' నుండి ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపారు.. అసలు ఏం జరిగిందంటే..? శనివారం మధ్యాహ్నం ఇందన్‌పల్లి సెక్షన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు జన్నారం ఎఫ్‌డివోకు అందిన పక్కా సమాచారం మేరకు, రంగంలోకి దిగిన ఎఫ్ఆర్ఓ (ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్) లక్ష్మీనారాయణ బృందం అటవీ మార్గాల్లో మాటు వేశారు.. ఇసుకతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని సీజ్ చేశారు.. ఈ ఆపరేషన్‌లో ఎఫ్ఎస్ఓలు రవి, హన్మంతరావు, ఎఫ్‌బిఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, తన్వీర్ పాషా మరియు బేస్ క్యాంప్ సిబ్బంది అత్యంత ధైర్యసాహసాలతో పాల్గొన్నారు..

**ఖబడ్దార్.. నిఘా నీడలోనే అడవి..!**

ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అక్రమార్కులకు హెచ్చరికలు జారీ చేశారు.. పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా, ఎకో సెన్సిటివ్ జోన్‌లో తవ్వకాలు జరిపితే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది,

దీనిపై కఠిన చర్యలు తప్పవు. వేటగాళ్లపై నజర్, వన్యప్రాణుల వేటగాళ్లపై, కలప స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.. అటవీ సంపదను దోచుకోవాలని చూస్తే జైలు శిక్ష తప్పదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. ప్రజల సమాచారమే అడవికి శ్రీరామరక్ష అంటూ, అడవిని కాపాడుకోవడం కేవలం అధికారుల బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి బాధ్యతగా అధికారులు పేర్కొన్నారు. కలప, ఇసుక అక్రమ రవాణా లేదా వన్యప్రాణుల వేట గురించి ఎటువంటి సమాచారం ఉన్నా భయపడకుండా, అధికారులకు తెలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచి, అటవీ సంపదను కాపాడతామని తెలిపారు.

# జనాభా వృద్ధితోనే ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణపై ఎలాంటి నిబంధనలు లేవని, అక్కడ జనాభా వృద్ధి ఎక్కువగా ఉందని... దీని వల్లే దేశంలో వారి రాజకీయ ఆధిపత్యం పెరుగుతోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. 'స్థానిక సంస్థల్లో పోటీ చేసేవారికి ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేత సమయంలో శాసనసభ సమావేశాలు జరగని కారణంగానే ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో పంచాయతీల ఎన్నికలు పూర్తయ్యాయని... ప్రస్తుతం చట్టం చేయడానికి సభలో బిల్లును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీంతోపాటు ఒక గ్రామం పేరు మార్పునకు సంబంధించి బిల్లును కూడా మంత్రి ప్రవేశపెట్టారు. రెండు బిల్లులకూ సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సీతక్క మాట్లాడారు. "రాష్ట్రంలో మహిళలు సగటున 1.7 చొప్పున మాత్రమే పిల్లల్ని కంటున్నారు. ఒక్కొక్కరు కనీసం ఇద్దర్ని కంటే సమాజానికి, దేశ భవిష్యత్‌కు మేలని నిర్ణయించి... చట్టాన్ని సవరిస్తున్నాం. స్థానిక సంస్థల ప్రతినిధుల నుంచి వచ్చిన

-4 లో

# మోదీపై కూనంనేని వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి

- వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్య
- అంతర్జాతీయస్థాయిలో దేశం గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అన్న కిషన్ రెడ్డి
- ప్రధానిపై కూనంనేని అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు శ్రమిస్తూ, అంతర్జాతీయస్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అని కొనియాడారు.

అలాంటి ప్రధానిపై కూనంనేని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూనంనేని వంటి వారు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాని మోదీపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి సభాపతిని కోరారు.కాగా, కూనంనేని సాంబశివరావు శాసనసభలో మాట్లాడుతూ, మోదీ మైండ్‌ను టెస్ట్ చేయించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# అందుకే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

### అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన బీఆర్ఎస్

### ప్రజా సమస్యలపై సీఎం సమాధానాలు చెప్పడం లేదని వేముల మండిపాటు

### వచ్చే సమావేశాల్లోనైనా తమకు మైక్ ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తమ పార్టీ సభ్యులకు స్పీకర్ మైక్ ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేసింది. అనంతరం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ప్రజా సమస్యలపై సమాధానాలు చెప్పకపోవడం అసెంబ్లీ ధర్మానికి విరుద్ధమని ఆయన ఆరోపించారు. "ప్రజా సమస్యలపై సమాధానం ఇవ్వకుండా ఇష్టానుసారం మాట్లాడుతూ, హరీశ్ రావును టార్గెట్ చేయడం అసహ్యకరం" అని తెలిపారు.ప్రశాంత్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యవహారాన్ని కూడా ప్రశ్నించారు. అసెంబ్లీలో అధికారపక్షానికి మాత్రమే మైక్ ఇవ్వడం దారుణమని అన్నారు. అందుకే తాము అసెంబ్లీని బహిష్కరించామని తెలిపారు. "అసెంబ్లీని బహిష్కరించాల్సి రావడం బాధాకరం, ఇప్పటికైనా వారికి కనువిప్పు కలిగి, వచ్చే సమావేశాల్లోనైనా మాకు మైక్ ఇవ్వాలనేది మా డిమాండ్" అని చెప్పారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకూ గృహజ్యోతి

### 200 యూనిట్లు దాటితే పథకం వర్తించదు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇందిరమ్మ పథకంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి, కొత్తగా రేషన్‌కార్డులు వచ్చినవారికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కొత్తగా పథకం అమలుకు, మార్పులు చేర్పుల కోసం పురపాలక, ఎంపీడీవో కార్యాలయాల్లోని ప్రజాపాలన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 52.82 లక్షల నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా లబ్ధి చేకూరుతోందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లబ్ధిదారుల తరఫున రాష్ట్ర ప్రభుత్వం రూ.3,593 కోట్లకుపైగా చెల్లించిందని వివరించారు. నిబంధనల మేరకు 200 యూనిట్ల వరకే పథకాన్ని అమలు చేస్తామని.. అంతకు మించితే రాదని స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సైతం 200లోపు

-4 లో

# సీఎం రేవంత్ ఆసాంతం అసత్యాలు వల్లె వేశారు

## భారాస సీనియర్ నేత హరీశ్ విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**శాసనసభలో అబద్ధాలకు ఆస్కారం లేదంటూనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆసాంతం అసత్యాలు మాట్లాడారని భారాస సీనియర్‌నేత హరీశ్‌రావు విమర్శించారు. సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారాస చేసిన న్యాయపోరాటం వల్లనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఎన్‌జీటీ స్టేఇస్తే, అది తన ఘనకార్యంగా రేవంత్ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్సే తెచ్చిందనడం హాస్యాస్పదమని చెప్పారు. ప్రాజెక్టు కోసం 2009 సాధారణ ఎన్నికల సమయంలో సీఎంఓ నోట్ ఇస్తే.. 2014 ఎన్నికల సమయంలో డీపీఆర్ కోసం జీఓ జారీ చేసిన చరిత్ర నాటి కాంగ్రెస్ ప్రభుత్వానిదని విమర్శించారు. 'డీపీఆర్ కోసం జీఓ ఇవ్వడానికి అయిదేళ్లు చేసిన మీరా.. మాగురించి మాట్లాడేది' అని ప్రశ్నించారు.

-4 లో

# జనాభా వృద్ధితోనే ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం

-3 పేజి తరువాయి

విజ్ఞప్తుల మేరకు ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేశాం' అని సీతక్క పేర్కొన్నారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... 'మన దేశానికి జనాభా ఒక సానుకూలాంశంగా ఉంది. ఒకప్పుడు చైనా జనాభాను నియంత్రించగా ఇప్పుడు అక్కడ వృద్ధుల శాతం పెరిగి.. తిరిగి సంతానోత్పత్తి పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు కూడా జనాభా పెంచాలని సూచిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ లింగ నిష్పత్తిని కాపాడే చర్యలు తీసుకోవాలి. ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపుతో కొత్తవారికి రాజకీయావకాశాలు దక్కాయి. జనాభా విషయంలో స్వీయ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి' అని అన్నారు. భాజపా సభ్యుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... 'ఎన్నికల్లో ప్రయోజనం కోసమే ఇద్దరు పిల్లల నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసినట్లు కనిపిస్తోంది. దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని జనాభా నియంత్రణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. సాఫ్ట్‌వేర్ వంటి ఆధునిక ఉద్యోగాలు చేసేవారు, ఉన్నత విద్యావంతులు ఒకరిద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్న రోజులివి' అని పేర్కొన్నారు.

**ఈ ఊర్ల పేర్లు పలకలేం!**

పలకడానికి ఇబ్బందిగా ఉన్న గ్రామాల పేర్ల మార్పుపై శాసనసభలో శనివారం ఆసక్తికరమైన చర్చ జరిగింది. భాజపా సభ్యుడు హరీశ్ (సిర్పూర్) మాట్లాడుతూ... ఆసిఫాబాద్‌జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని ఓ గ్రామం పేరు 'ల..గూడ'ను పలకడం ఇబ్బందిగా ఉందని, దాన్ని నందిగూడగా మార్చాలని ప్రజలు కోరుతున్నారని, అలాగే చింతలమానేపల్లి మండలం లంబాడిహెట్టి పేరును ప్రేమ్‌నగర్‌గా మార్చాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. వీటిపై కలెక్టర్ల నుంచి నివేదిక తెప్పించుకుంటామని మంత్రి సీతక్క సమాధానమిచ్చారు. వనపర్తి జిల్లాలోని జయన్న తిరుమలాపూర్ ఊరి పేరు రికార్డుల్లో జైన్ తిరుమలాపూర్ అని తప్పుగా నమోదైందంటూ గతంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన విజ్ఞప్తితో ప్రభుత్వం చట్టసవరణ ద్వారా ఆ గ్రామం పేరు మార్చింది.

# సీఎం రేవంత్ ఆసాంతం అసత్యాలు వల్లె వేశారు

-3 పేజి తరువాయి

తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ భాగం పంచుకోని రేవంత్‌రెడ్డి.. ఉద్యమ సారథి అయిన కేసీఆర్ చిత్తశుద్ధి గురించి ప్రశ్నించడం అంటే సూర్యుడిపై ఉమ్మేయడమేనని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు కేటాయింపులను 45 టీఎంసీలకు తగ్గించిన మాట నిజమేనని అసెంబ్లీలో సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి చెప్పక తప్పలేదన్నారు. నాడు నల్గొండలో కేసీఆర్ గర్జిస్తే.. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించమంటూ తీర్మానం చేశారని, నేడు భారాస నిలదీస్తేనే పోలవరం నల్లమలసాగర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తీర్మానించారని పేర్కొన్నారు. భారాస వరద జలాలపై ఒక స్టాండ్ తీసుకోవాల్సి ఉండాల్సిందని రేవంత్ వ్యాఖ్యానించడం అవివేకమన్నారు. అలా స్టాండ్ తీసుకొని డీపీఆర్ ఇస్తే... సీడబ్ల్యూసీ పరిశీలన కాదు కదా.. కనీసం స్వీకరించదనే విషయం ముఖ్యమంత్రికి తెలియకపోవడం విచిత్రంగా ఉందన్నారు. ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఎజెండాలోని అంశాలను సగంసగం చదువుతూ.. వాక్యాలను వక్రీకరిస్తూ సభను తప్పుదోవ పట్టించారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ చేసిన ఆరోపణలు, చెప్పిన అబద్ధాలకు తగిన సమాధానం పూర్తి సాక్ష్యాధారాలతో వివరిస్తానని హరీశ్ చెప్పారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి.. పార్లమెంటరీ సంప్రదాయాలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగా.. అధికారంలోకి వచ్చాక మరోలాగా కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని అసెంబ్లీ భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శనివారం 'ఎక్స్' వేదికగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి.. ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. 'ఉత్తమ్‌జీ.. పీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? నాడు అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రజంటేషన్ నిర్వహిస్తే.. అది భారతదేశ పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని, అందుకే మేము సభకు హాజరుకాబోమని ఆ లేఖలో రాశారు. ఇప్పుడు మీరే స్వయంగా మంత్రి హోదాలో ప్రజంటేషన్‌కు సిద్ధపడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఆ ఉత్తరంపై నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతి కూడా సంతకాలు చేశారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షానికి పీపీటీకి అనుమతిస్తే.. భారాస పక్షానికీ ఇవ్వాలని స్పీకర్‌కు లేఖ ఇచ్చాం. కానీ మా అభ్యర్థనను తిరస్కరించారు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకూ గృహజ్యోతి

-3 పేజి తరువాయి

యూనిట్లు వాడితేనే పథకం వర్తిస్తుందన్నారు. శాసనసభలో శనివారం గృహజ్యోతిపై సభ్యులు వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, దానం నాగేందర్ తదితరుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా మొత్తం 52,82,498 కుటుంబాలు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో 65,862... సిద్దిపేటలో 50,398 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి" అని భట్టి తెలిపారు. అంతకుముందు పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... గృహజ్యోతిలో 200 దాటి 10-15 యూనిట్లు ఎక్కువైతే మొత్తం యూనిట్లకు బిల్లులు వసూలు చేస్తున్నారని, కొన్నిచోట్ల పథకం నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

**అందెశ్రీని గౌరవించుకోవడం మన బాధ్యత**

ప్రసిద్ధ కవి, ప్రజా కళాకారుడు అందెశ్రీని గౌరవించుకోవడం మన బాధ్యతని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అందెశ్రీ కుమారుడు దత్తసాయికి సహాయ ఆచార్యుడిగా ప్రభుత్వ ఉద్యోగ కల్పన, 7,991 మంది ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి 'తెలంగాణ పబ్లిక్ సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ, సర్వీసులకు నియామకాల క్రమబద్ధీకరణ- వేతన స్వరూపం హేతుబద్ధీకరణ' తదితర బిల్లులను ఆయన సభలో ప్రవేశపెట్టారు. ఈ రెండు బిల్లులకు చర్చ అనంతరం సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. అందెశ్రీ ఆకస్మిక మరణం నేపథ్యంలో ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించాం. అలాగే గద్దర్ త్యాగాలను గుర్తించి ఆయన పేరిట అవార్డును ఏర్పాటు చేశాం' అని పేర్కొన్నారు. అనంతరం ఒప్పంద, పొరుగు సేవల బిల్లుపై మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్లు, డ్రైవర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు కలిపి 7,991 మందికి ఉద్యోగ క్రమబద్ధీకరణ చేసేందుకు చట్ట సవరణ చేస్తున్నాం. దీనివల్ల ఖజానాపై ఏటా రూ.2,295 కోట్ల భారం పడుతుంది' అని భట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యులు మందుల సామేల్, శంకరయ్య, కంభంపాటి అనిల్‌కుమార్‌రెడ్డి బిల్లులకు మద్దతు తెలిపారు.

భాజపా సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. 'అందెశ్రీ కుమారుడికి ఉద్యోగం ఇవ్వడాన్ని సమర్థిస్తున్నాం. 2001-14 మధ్య తెలంగాణ కోసం 1,200 మంది అమరులయ్యారు. వారి రుణం తీర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా వారి కుటుంబసభ్యులకు 250 గజాల ఇంటిస్థలం, కుటుంబానికో ఉద్యోగం ఇవ్వాలి' అని అన్నారు. పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ.. ఉద్యమంలో ఆడిపాడిన 400 మంది సాంస్కృతిక సారథి కళాకారులకు ఉద్యోగాలు కల్పించి భరోసా ఇవ్వాలని కోరారు.

# గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత

**హైదరాబాద్ పెన్ పవర్:** గిగ్‌వర్కర్ల ఇటీవల సమ్మె పిలుపుతో ఫుడ్ యాప్‌లతో పాటు తాజాగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. 90 రోజులు పనిచేస్తే గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తూ కేంద్రం ముసాయిదా పత్రాన్ని విడుదల చేసింది. ఒక ఆర్థిక సంవత్సరంలో డెలివరీ బాయ్స్ ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు పని చేస్తే ఈ ప్రయోజనాలు పొందవచ్చు. లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద 120 రోజులు పని చేయాలి. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటి డిమాండ్లతో గిగ్ వర్కర్లు గత నెల రెండుసార్లు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఈ నేపథ్యంలోనే ఫుడ్ యాప్స్ సంస్థలు స్విగ్గీ, జొమాటో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గిగ్‌వర్కర్ల కోసం కేంద్రం నూతన ముసాయిదా నిబంధనలను తీసుకొచ్చింది. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30న ప్రభుత్వం విడుదల చేసింది. రోజువారి ఆదాయంతో సంబంధం లేకుండా సామాజిక భద్రతను కల్పిస్తుంది. ఒకవేళ ఒక గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. కాగా.. అసంఘటిత కార్మికులకు సంబంధించిన ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికే సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. కార్మికశాఖ ఇప్పటికే రిజిస్ట్రేషన్లను ప్రారంభించిందని తెలిపింది. ఇందులో నమోదు చేసుకున్నవారికి గుర్తింపు కార్డును జారీ చేస్తారు.

# బళ్లారి కాల్పుల ఘటన.. ఎస్పీ పవన్ నిజ్జూర్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక లోని బళ్లారి నగరం కాల్పులతో రణరంగంగా మారిన విషయం తెలిసిందే. ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో రెండు మధ్య ఘర్షణతో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే విధి నిర్వహణలో వైఫల్యం చెందారన్న ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ పవన్ నిజ్జూర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, పవన్ నిజ్జూర్ గురువారమే ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఛార్జ్ తీసుకున్న కొద్ది గంటల్లోనే ఇంతటి తీవ్ర పరిణామం జరగడం, దానిపై ఆయన సస్పెండ్ కావడం పోలీసు వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. శాంతిభద్రతలను కాపాడటంలో ఉన్నతాధికారులకు సరైన సమాచారం చేరవేయడంలో ఆయన విఫలమయ్యారని ప్రభుత్వం పేర్కొంది. కాగా, బళ్లారిలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హవంబభావి ప్రాంతంలో బ్యానర్లు కట్టే విషయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి అనుచరులకు, కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి వర్గీయులకు మధ్య వాగ్వాదం మొదలైంది. గాలి జనార్దన్ రెడ్డి నివాసం సమీపంలోనే ఈ గొడవ జరగడంతో పరిస్థితి వేగంగా ఉద్రిక్తంగా మారింది. అనంతరం ఇరువర్గాలు పరస్పరం రాళ్ల దాడికి దిగాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే భరత్ రెడ్డి అనుచరుడు గన్‌మెన్ దగ్గర నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపినట్లుగా తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ తీవ్రంగా గాయపడి మరణించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీచార్జ్ చేయడంతో పాటు గాలిలోకి కాల్పులు జరిపి గుంపును చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## సోషల్ మాధ్యమం ఎక్స్‌కు కేంద్రం నోటీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మాధ్యమం ఎక్స్‌కు భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా నోటీసులు జారీ చేసింది. ఐటి చట్ట నిబంధనలను అమలు చేయడంలో తీవ్రమైన లోపాలున్నాయని నోటీసులో పేర్కొంది. ఎక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టూల్ అయిన గ్రోక్‌లో మహిళలు, పిల్లలపై అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేస్తుందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్పందించింది.. గ్రోక్ కోడింగ్‌ను, ఫ్రేమ్‌వర్క్‌ను సమీక్షించాలని, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశించింది. దీనిపై 72 గంటల్లో సరిచేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని నోటీసులో హెచ్చరించింది. ఈ మేరకు ఎక్స్ ఇండియా ఆపరేషన్స్ చీఫ్ కంప్లైయన్స్ ఆఫీసర్‌కు నోటీసులు అందించింది. ఈ నోటీసులో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000, ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ నిబంధనల పాటించడంలో విఫలమైనట్లు స్పష్టం చేసింది. వీటిని పాటించకపోవడం తీవ్రంగా పరిగణించింది. '' మీ ప్లాట్‌ఫామ్, దాని బాధ్యతాయుతమైన అధికారులు, చట్టాన్ని ఉల్లంఘించే వినియోగదారులపై ఐటి చట్టం, ఐటి నిబంధనలు, ఇతర చట్టాల ప్రకారం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా కఠినమైన చట్టపరమైన పరిణామాలకు దారితీయొచ్చు" అని ఆ ఉత్తర్వులో పేర్కొంది. గ్రోక్ ఎఐ టూల్ యొక్క సాంకేతిక, పాలనా ఫ్రేమ్‌వర్క్‌ను తక్షణమే సమీక్షించాలని ఆదేశించింది. అయితే దీనిపై ఎఐ చాట్‌బాట్ గ్రోక్ స్పందించింది. భద్రతా చర్యలలో లోపాలున్నాయని అంగీకరిస్తూ చర్యలు తీసుకుంటామని కేంద్రానికి తెలిపింది..

## ఫిబ్రవరి 5న బండ్లపల్లికి కాంగ్రెస్ నేతలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కేంద్రం రద్దు చేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 5న ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో ఆందోళన్ చేపట్టాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. అందులో భాగంగా పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండ్లపల్లి గ్రామాన్ని సందర్శించే అవకాశం వుంది. 20ఏళ్ల క్రితం ఈ చారిత్రక పథకాన్ని ప్రారంభించిన గ్రామం అది. సోనియా గాంధీ, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో 2006 ఫిబ్రవరి 2న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ సమయానికి వారు ఇక్కడ పర్యటించాలని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ప్రతిపాదించారు. దీన్ని పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. 'కార్మికుల హక్కులను ప్రభుత్వ భిక్షగా మార్చడానికి' మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ సిద్ధమైన నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఉపాధి హామీ అమలును బలోపేతం చేయాలని, గ్రామీణ కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ జనవరి 5న రాష్ట్రవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లా, మండల, గ్రామస్థాయి నేతలకు ఎపి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఇండియా బ్లాక్ భాగస్వాములతో, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, యువజన, మహిళా విభాగాల సమన్వయంతో అందరూ విస్తృతంగా పాల్గొనేలా ఈ ప్రచారోద్యమాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపడతారు. విబి-జి ఆర్ఎఎం జి'పై ఆ వేదిక ద్వారా ఫిర్యాదులు అందజేస్తారు.

## కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల వేడి: రిజర్వేషన్లపై అభ్యర్థుల ఉత్కంఠ

**కామారెడ్డి పెన్ పవర్:** కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద పట్టణాల్లో రాజకీయాలు వేడెక్కాయి. కామారెడ్డిలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. అధికారులు ఓటర్ల జాబితాను విడుదల చేసి, అభ్యంతరాలకు గడువు విధించారు. ఈ నెల 10న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ వార్డుల్లో రిజర్వేషన్లు ఎలా వస్తాయోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వలిగొండ పెన్ పవర్:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి బీసీ సంఘం, బహుజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆమెకు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సమస్త మహిళా లోకానికి ఆదర్శనీయమని, ప్రతి ఒక్క మహిళ విద్యనభ్యసించి ఉండాలని విద్యా ఉద్యమానికి పునాదులు వేసిన మహనీయురాలని, సామాజిక సంస్కర్త, ప్రథమమహిళా ఉపాధ్యాయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్, బిసి సంఘం పట్టణ అధ్యక్షుడు నానచర్ల రమేష్, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, ప్రజా ప్రశీట్ మండల కన్వీనర్ రాపోలు పవన్ కుమార్, దేగల అంజయ్య, సలిగంజి బిక్షపతి, పోలేపాక యాదయ్య, పిట్టల అంజయ్య, గొలుసుల మల్లేష్, శీలం స్వామి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక విప్లవ మూర్తి సావిత్రిబాయి పూలే

**హైదరాబాద్ పెన్ పవర్:**మహబూబాబాద్ జిల్లా కేంద్రం శ్రీ సాయి దత్త ఒకేషనల్ కళాశాల నందు సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని సెమినార్ సావిత్రిబాయి జీవితం సామాజిక న్యాయం అంశంపై ముఖ్య వక్తగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి పాల్గొని ప్రసంగించారు మూడు వేల ఏండ్ల మను స్మృతి మానసిక విషచట్టాల మాటున. దేశంలో మెజార్టీ ప్రజలకు సకల హక్కులు నిషేధం. ద్వితీయ శ్రేణి పౌరురాలుగా అణిచివేతకు గురైన ఓ మహిళ .నాగరికపు సమాజాన్ని నిర్మించడానికి నానా కష్టాలు అవమానాలు భరించింది. అని అన్నారు మనుషులందరూ సమానులే అని చాటడానికి తన జీవితాంతం కృషి చేసింది శూద్రులు మహిళలకు అశ్రుశులకు విద్య అనే ఆయుధాన్ని అందించింది ఆమె నాటి చీకటి సమాజానికి వెలుగు దివిటి అందించింది ఆమె వీరవనిత సామాజిక విప్లవ మాతృమూర్తి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి పూలే. కృషిని సరస్వతి దేవి దయగా మార్చేస్తున్న మనువాదపు కుతంత్రాలకు చేదించాల్సిన అవసరం ఉంది .వేల ఏండ్లుగా శూద్రులు అశ్రుశులకు మహిళలు చూడవా కూడదు చదువు వినకూడదని కఠిన విషమ షరతులు నూటికి 90 శాతంమందినినిరక్షరాస్యులుగా అనాగరిక సమాజంలో వదిలేసిందిఅన్నారుసావిత్రిబాయి పూలే లక్ష్యాలు ఆశయాలు పాలకులుఆచరించాలనుకుంటే అందరికి సమాన విద్యను అందించే విధంగా ప్రయత్నాలు సాగించాలి సావిత్రిబాయి పూలే ఏ సామాజిక విప్లవాత్మక మార్పుల కోసంపరితపించారు ఆలక్ష్యంనేటికీనెరవేర్చబడలేదు ఆమె చూపిన మార్గం సామాజిక వాదులకు ఒక సవాలు గాని మిగిలింది అని అన్నారు ఈ లికార్యక్రమంలోకెవిపిఎస్ జిల్లానాయకులు దైద సురేంద్రనాథ్ అధ్యక్ష వర్గంగా జరిగిన కార్యక్రమంలో చేపూరి గణేష్ టీచర్లు సుధారాణి పావని శివ విద్యార్థులు అఖిల సుదీర్ఘ రక్షణ ప్రశాంత్ నాగేష్ సాగర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటి శ్రీ బానోత్ రాంబాబు గారి అధ్యక్షతన పాలకవర్గం సమీక్షా సమావేశం....

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట మార్కెట్ చైర్మెన్ ల సంఘం రాష్ట కమిటి సభ్యులుగా ఎన్నికైన ఇల్లందు చైర్మెన్ శ్రీ బానోత్ రాంబాబు గారిని పాలకవర్గం సభ్యులు,మార్కెట్ ఉద్యోగులు సన్మానం. 2025వ సంవత్సరం ఇల్లందు మార్కెట్ ఆదాయ వ్యయలపై పాలకవర్గం సమీక్షా.. మార్కెట్ అభివృద్ధికి గౌరవ శాసన సభ్యుల శ్రీ కోరం కనకయ్య గారి క్రృషితో మంజూరు అయిన నిధుల గురించి పాలకవర్గం సభ్యులకు చైర్మెన్ గారు సంక్లుప్త వివరణ డైరెక్టర్ భుక్యా అశోక్ గారి రాజీనామ పాలకవర్గం అమోదం,తుదపరి డైరెక్టర్ నియామకం ఎమ్మెల్యే గారి అమోదమే ఫైనల్ గా పాలకవర్గం తిర్మానం....ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ శ్రీ బానోత్ రాంబాబు గారిలి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలకవర్గం సమావేశంలో భాగంగా..మార్కెట్ఆదాయ,వ్యయలపై సమీక్ష జరిపి గౌరవ శాసన సభ్యులు శ్రీ కోరం కనకయ్య గారి క్రృషితో మంజూరైన నిధులపై చెపట్టవల్సిన అభివృద్ధి పనులపై సమిక్ష జరిపారు...ఈ సమావేశంలో గ్రేడ్ 3 సెక్రెటరి నరేష్,సూపర్వైజర్ శ్రీనివాసరావు,మార్కెట్ వైస్ చైర్మెన్బిజ్జావెంకటేశ్వర్లు,డైరెక్టర్లు మాళోత్ బావుసింగ్,బొల్లి రాజు,కుంజావసంతరావు, గుగులోత్ గబ్రు,ఊకె బుచ్చయ్య,బానోత్ జింకు,భుక్యా శివలాల్,జిగట వెంకన్న,మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు

### జిల్లా కలెక్టరేట్లో ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుక ఉత్తమ సేవలకు కలెక్టర్ సన్మానం

**హైదరాబాద్ పెన్ పవర్:**రోజు మహబూబాబాద్ కలెక్టరేట్లో చదువుల తల్లి , స్త్రీ విద్య హక్కులకై కృషి చేసిన వీరవనిత సావిత్రిబాయి పూలే 195 వ జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌరవనీయులు శ్రీ అద్వైత్ కుమార్ ×ూూ గారిచేతుల మీదుగా గూగులోత్ అశ్విని జూం పూసల తండా (లిగార్ల మండలం)ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గారితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ణజూూ , ఇతర జిల్లా అధికారులు ఝుఖీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు. భద్రునాయక్ మరియు ఇతర సోదర ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు తోపాటు సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..

## కొమ్మాయిగూడెం సర్పంచ్ ను ఘనంగా సన్మానించిన ట్రస్మ నాయకులు

**హైదరాబాద్ పెన్ పవర్:**చౌటుప్పల్ మల్లికార్జున స్కూల్ కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కొమ్మయిగూడెం సర్పంచిగా ఎన్నికైన సందర్భంగా శనివారం ట్రాస్మా నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ట్రస్మ జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశం మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మల్లారెడ్డి నేడు గ్రామ సర్పంచ్ గా గ్రామాన్ని తీర్చిదిద్ద వలసిన అవకాశం దొరికిందని, తీర్చిదిద్దుతారని విశ్వాసం తమకుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రట్రాస్మా ఉపాధ్యక్షులు కృష్ణారావు,జిల్లా నాయకులు గురునాథపల్లి మల్లేశం,మండల అధ్యక్షులు కృష్ణంరాజు, ఎండి సయ్యిద్ షమీము, శ్రీనివాస్, ట్రినిటీ స్కూలు ప్రిన్సిపాల్ మంజుల ,గోదాదేవి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ జి టి యు క్యాలండర్, ఆవిష్కరించిన ఎమ్మార్వో శివప్రసాద్,




**పెన్ పవర్, జనవరి, 3**చేగుంట / మండల కేంద్రంలో ఎస్ జి టి యు, జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన చేగుంట ఎమ్మార్వో కే, శివప్రసాద్ ఎంఈఓ, టి నీరజ మేడం, ఎస్ జిటియు, 2026 క్యాలెండర్ ఆవిష్కరణ చేసి విద్యా వ్యవస్థకు పునాది ప్రాథమిక విద్య అని ప్రాథమిక విద్యను అందిస్తూ విద్యావ్యవస్థకి కీలకంగా ఉండి భోదన అందిస్తున్న ఎస్ జి టి ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిఖార్జున్, రాజశేఖర్ జిల్లా మండల నాయకులు సిద్ధిరాములు,యాదగిరి,రామకృష్ణ, రజని దాస్, సుమలత, మౌనిక, నర్సింలు, కిషన్, శ్రీనివాస్, రామచంద్రం, నాగరాజు, ఎంఆర్సి స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు.

- పాల్గొన్న స్థానిక ఎస్సై.




**పెన్ పవర్, జనవరి, 3**వలిగొండ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా విద్యా ఉద్యమానికి పునాదులు వేసిన మహానీయురాలని, సామాజిక సంస్కర్త, ప్రథమమహిళా ఉపాధ్యాయురాలని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై యుగంధర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి,పట్టణ అధ్యక్షుడు నానచర్ల రమేష్, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, ప్రజా ప్ర%శీ%ట్ మండల కన్వీనర్ రాపోలు పవన్ కుమార్, దేగల అంజయ్య, సలిగంజి బిక్షపతి, పోలేపాక యాదయ్య, పిట్టల అంజయ్య, గొలుసుల మల్లేష్, శీలం స్వామి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాలక వర్గానికి సన్మానం, విశ్రాంతి ఉద్యోగుల సంఘం



**పెన్ పవర్, జనవరి, 3**చేగుంట మండల కేంద్రంలో నూతన పాలక వర్గానికి, విశ్రాంత ఉద్యోగుల భవనంలో నేడు అధ్యక్షులు కరణం నర్సింలు ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఆహ్వానించి వారికి శాలువతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సండ్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మొహమ్మద్ రఫి, గ్రామ వార్డ్ సభ్యులు, విశ్రాంతి ఉద్యోగులు సంఘం అధ్యక్షులు కరణం నర్సింలు, ప్రధాన కార్యదర్శి,సూర్య ప్రకాష్, దొడ్ల రామచందర్, తాళ్లపల్లి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## తాటికాయల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సావిత్రి భాయి పూలే ,195 జయంతి వేడుకలు

- మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన వార్డు మెంబర్లు




**పెన్ పవర్, జనవరి, 3**తాటికాయల గ్రామంలోని ప్రభుత్వ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ 3వ, 8వ వార్డు సభ్యులు పట్ల రమేష్, బొల్లెపాక అనిత సంపత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం మహిళా ఉపాధ్యాయులతో కేకు కట్ చేయించి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ మాట్లాడుతూ, మహిళా విద్యకు సావిత్రి భాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో విద్య తీసుకురావాలనే లక్ష్యంతో ఆమె చేసిన కృషి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.వార్డు సభ్యులు పట్ల రమేష్, బొల్లెపాక అనిత సంపత్ మాట్లాడుతూ, మహిళల విద్యాభివృద్ధికి సావిత్రి భాయి పూలే చూపిన దారి ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. విద్యే సమాజ పురోగతికి మూలాధారమని, విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్, వసుందర, శ్రీనివాస్, రాజు, ఇందిరాణి, కల్యాణ్, పీఎస్ హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, రాజు, హేమలత,గ్రామ యువకులు బొల్లెపాక రమేష్,ప్రవీణ్,నవీన్,నల్ల సుకుమార్ తదితరులు పాల్గొన్నారు..

# జూలూరుపాడు లో , ఘనంగాసావిత్రిబాయి పూలే జయంతి

- అంగనవాడి సుభద్రటీచర్ ను సన్మానించిన ఉపాధ్యాయులు

**పెన్ పవర్, జనవరి, 3:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలం జూలూరుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని కోయ కాలనీ అంగనవాడి ప్రీ స్కూల్ నందు సావిత్రిబాయి పూలే జయంతి జరుపుకున్నారు మరియు ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని జూలూరుపాడు ప్రీ అంగనవాడి టీచర్ బాదావత్ సుభద్రా మరియు ప్రైమరీ స్కూల్ టీచర్ గుగులోతు పద్మ ను సన్మానించినారు సావిత్రిబాయ్ పూలే నీ ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఆమె కలలు నిజం చేయాలని ఉపాధ్యాయురాలు వివరించటం జరిగింది సావిత్రిబాయి పూలే భర్త జ్యోతి రావు చరిత్ర చూసుకుంటే సావిత్రిబాయి పూలే జనవరి మూడో తేదీన వైతాళితులను ప్రసవంచాల్సిన చరిత్రక కర్తవ్యాన్ని చరిత్ర మాత చేపట్టిన కురిటి నొప్పులు భరించి కానీ పెంచిన విప్లవ వైతాళికురాలు సావిత్రి పూలే బహుజన సమాజంతో పాటు అన్ని వర్గాల స్త్రీలు ఓనమాలు కూడా దిద్దలేని అజ్ఞానం మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న అంధకార సావిత్రి పూలే 1831 వ సంవత్సరం జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని మహారాష్ట్రలోని సంతార జిల్లాలోని నయగావ్ గ్రామం లో జన్మించారు బాల్యం నుండి సహజంగా అభ్యున్న పట్టుదల విజ్ఞాస వంటి గుణాలు భర్త జ్యోతిరావు సహచర్యంలో మరింతగా వికాసం చెందాయి మరాఠా ప్రాంతంలో విప్ల పాలన అంతమై ఆంగ్లేయుల దినములోని కి వచ్చినా కూడా గ్రామాలలో ఆధిపత్య వర్గాల స్వభావం పాలన స్వరూపం మారలేదు 1813 చిరాక్టార్ చట్టము 1835 మేకల్ విద్యా విధానంతో బ్రిటిష్ ప్రభుత్వం ఐరోపా విజ్ఞానం శాస్త్రీయ విద్యాలయ వ్యాప్తికి కృషి చేయడం ప్రారంభించింది ఫలితంగా క్రింది జాతుల ప్రజలు విద్యా అవకాశాలకు ప్రోత్సాహం లభించింది ఈ అవకాశం అంది పుచ్చుకున్న జ్యోతిరావు తన విద్యాభ్యాసాన్ని ప్రభుత్వం స్కూటీ స్ బడుల్లో పూర్తి చేశాడు ఉదాంత ప్రజాస్వామిక భావాలతో వేరే పితుడైన జ్యోతిరావు సావిత్రిబాయికి సహచరుడుగా లభించడం ఒక మహెూత్తర ఘట్టం ఈ జంట భారతదేశ సాంఘిక విద్య విప్లవానికి తమ శక్తినంత ధారపోశారు పూలే దంపతులు పూణేలోని గోదరావుపేట బాలిక పాఠశాలను 1848 జనవరి 1న ప్రారంభించారు బాలికల పాఠశాల కావడంతో పని చేసేందుకు మగవారు ఎవరు ముందుకు రాలేని స్థితిలో తనే తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా పాఠశాలను ధైర్యంగా నిర్వహించింది సావిత్రిబాయి విద్య లేక వివేకము తగ్గింది వివేకం లేక నీతి తగ్గింది నీతిలేక పురోగతి తగ్గింది పురోగతిలేక సంపద తగ్గింది సంపద లేక శు ద్దులు స్త్రీలు వెనకబడి పోయారు ఇంత అనర్థము అవిద్య వల్ల జరిగింది అని ప్రజలను చైతన్య పరుస్త%ట% మునుపు ఎప్పుడైనా ఆంక్షలు అన్ని నిజం కాదు వాటిని ఎప్పుడూ పాటించవలసిన అవసరం లేదు రండి చదువుకోండి అని ప్రచారం చేస్తూ బాలికలను బడికి తీసుకుని వచ్చేవారు 1846 నుండి 1876 వరకు పూలే జంట 50 కి పైగా పాఠశాలను వృద్దులు అతి సుద్దులు బాలికల కోసం ప్రోత్సహించారు వీరి కృషి ప్రభుత్వానికి ఇతర సంస్కరణ అనేక పాఠశాలల స్థాపనకు దారితీసి సావిత్రిబాయి స్వయంగా స్త్రీలలో చైతన్యాన్ని పెంపొందించే అందుకు మహిళా సేవా మండలి ప్రారంభించింది వితౌత్తులు ఆచార్య బాధితులు వారి పిల్లలకు ఆశయం కోసం బాల హత్యా ప్రతి బంద్ కి గృహాన్ని ఏర్పాటు చేసింది వీటితోపాటు జ్యోతిరావు నిర్వహించిన రైతాంగ కార్మిక హక్కుల పోరాటాలలో సత్యం శోధక సామాజ్ నిర్వహణలో క్రియేషన్ పాత్ర పోషించింది 1890లో పూలే మరణం తరువాత దుఃఖాన్ని దిగమెందుకొని అతని సామాజిక చైతన్య ఆశయ సాధన కార్యక్రమంలో కొనసాగించారు 1996లో మహారాష్ట్రల్లో కరువు వచ్చినప్పుడు ప్రభుత్వం ద్వారా సహాయ కార్యక్రమాలు జరిగేందుకు కృషి చేశారు సేవల వలన ఆరోగ్యం క్షీణించి 1997 వ సంవత్సరం మార్చి 10వ తేదీన సావిత్రిబాయి మహా పరిజ్ఞానం చెందింది సావిత్రి పూలే జీవితం ఉపాధ్యాయులకు సామాజిక కార్యకర్తలను ఒక నిరంతర చదవశక్తి అని అన్నారు










# ధర్మసాగర్ లో సావిత్రిబాయి పూలే 195 జయంతి

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత దళితరత్న చిలక రవీందర్**





**పెన్ పవర్, జనవరి, 3**
భారతదేశ మొట్టమొదటి చదువుల తల్లి సమాజానికి మేల్కొల్పిన ధైర్యస్వర సావిత్రిబాయి పూలే అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత దళితరత్న చిలుక రవీందర్ అన్నారు.
, స్థానిక ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద గడ్డం నవీన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి, ఉత్సవమును నిర్వహించడ మైనది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిలుక రవీందర్ పాల్గొని మాట్లాడుతూ సామాజిక అంశాలు ఉన్న కాలంలో వాటినింటిని చేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి, సావిత్రిబాయి పూలే, అణిచివేత, అవమానం, అపహాస్యం వంటి ఎన్నో అవరోధములను అధిగమించి సమానత్వం, మానవత్వం, న్యాయం విలువల కోసం ఆమె అలుపెరగకుండా మహిళల కోసం పోరాడినారు.సావిత్రిబాయి పూలే కేవలం బోధనకే పరిమితం కాలేదు అనాధలకు,వితంతువులకు,రోగుల సేవలోను పాల్గొని ఉపాధ్యాయ వృత్తికి మానవీయ విలువలను జోడించినారు .అట్టడుగు వర్గాల జీవితాలలో ప్రత్యేకంగా సంస్కరణలను తీసుకువచ్చిన తొలి వ్యక్తిగా సావిత్రిబాయి పూలే నిజమైన విద్య ఆయుధం, స్త్రీ విద్య,సామాజిక విప్లవం నిరూపించిన చదువుల తల్లి.తన అంకితభావంతో వ్యాధిగ్రస్తులకు ప్లేగు వ్యాధి తీవ్రంగా చెందుతున్న క్రమంలో వారికి సేవ చేస్తూ, ప్రాణాలు కోల్పోయిన ఆమె త్యాగానికి నేటి మహిళ ఉపాధ్యాయులంతా సావిత్రిబాయి పూలేను ఒక చారిత్రక వ్యక్తిగా మాత్రమే కాక వృత్తి నిబద్ధతకు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా ఉపాధ్యాయ వృత్తికి నిజమైన గౌరవం సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని అన్నారు.తదనంతరం మహిళల సమక్షంలో ఉపాధ్యాయులను, మెరిట్ విద్యార్థులను సన్మానించడమైనది .ఈ కార్యక్రమంలో ప్రభాకర్, సిద్ధోజు మంజుల, చెట్ల రమేష్ గౌడ్, గంప రవళి, ఉషారాణి, పి రాజేందర్, బొడ్డు నిఖిల్ ,ఎస్ ప్రభాకర్, గోపాలకృష్ణ ఆజాం, సాయిరాం, అక్షయ్, ఆజాద్, అఖిల్, బాబురావు, ధర్మసాగర్ గ్రామ యువత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీమతి సావిత్రిబాయి పూలే 195వ జయంతి - నివాళులర్పించిన నల్లగొండ బీసీ సంక్షేమ సంఘం.



**పెన్ పవర్, జనవరి, 3** శ్రీమతి సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా నల్లగొండ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించడం జరిగింది
బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1831 జనవరి03 తారీకున జన్మించి 1840లో మహాత్మ జ్యోతిరావు పూలేని వివాహమాడి అప్పుడున్న రోజుల్లో మహిళలకు పూర్తిగా విద్య నిషేధించిన రోజుల్లో మహాత్మ జ్యోతిరావు పూలే స్త్రీలకు విద్య లేనిది ఈ సమాజం వెలుగులో ఉండదని గ్రహించి తన భార్య అయినటువంటి సావిత్రిబాయి పూలేకు విద్యార్థులు నేర్పించి 50 పాఠశాలలు పెట్టి నెలకొల్పి మహిళలకు విద్యాబుద్ధులు నేర్పించి నటువంటి మొట్టమొదటి భారత దేశ మహిళా ఉపాధ్యాయురాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేయడం నలగొండ బీసీ సంక్షేమ సంఘం హర్ష వ్యక్తం చేయడం జరిగింది. ఇప్పటికైనా బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు
ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్, ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కటారి బాబు జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ రాజు జిల్లా కార్యదర్శి కుకుడాల ఏడుకొండలు దాసరి వెంకన్న పగిలి కృష్ణ వల్ల కీర్తి శ్రీనివాస్ ఏరుకొండ హరిసంగిశెట్టి నరసింహ %దీ% శ్రీనివాస్ రాపోలు సత్యనారాయణ మేడిగ నరసింహ అంజిబాబు పి మధు చిలుకూరి చంద్రమౌళి

## మండల అధికారులను శాలువతో ఘనంగా సన్మానించిన లింగరాజుపల్లి సర్పంచ్ బొడిగె లింగస్వామి.









**పెన్ పవర్, జనవరి, 3** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో మండల అధికారులు ఎమ్మార్వో ను ఎండిఓ ను కరెంటు ని మర్యాదపూర్వకంగా కలిసి అధికారులను శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు సర్పంచి బోడిగ లింగస్వామి తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు నెంబర్లు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఎంపీ కి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపిన అతహర్....




**పెన్ పవర్, జనవరి, 3**కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అతహర్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సరం సందర్భంగా వారి చిత్ర పటాన్ని బహుకరించి శు భాకాంక్షలు తెలియచేసారు.ఈ సందర్భంగా అతహర్ వారితో మాట్లాడుతూ కొత్త సంవత్సరం లో ప్రజా సమస్యలపై పార్లమెంట్ లో మరింత బలంగా కొట్లాడి నియోజకవర్గం అభివృద్ధి కొరకు నిధులు తేవాలాని కోరడం జరిగిందని అతహర్ అన్నారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆయురారోగ్యలతో నిండు నూరేళ్ల జీవించాలని ప్రజలకు ఇదే విధంగా సేవ చేయాలని కోరారు.

# మహిళా ఉపాధ్యాయునిలకు ఘనంగా సన్మానం

● ఉపాధ్యాయునిలను సన్మానించిన జెపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు

**పెన్ పవర్, జనవరి, 3**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గంలో జూలూరుపాడు మండలం లోని పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జెపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీరా సాహెబ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు విచ్చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు, పితస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిందని తెలిపారు అనంతరం పాపకొల్లు కాంప్లెక్స్ మహిళా ఉపాధ్యాయుని లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దామెర్ల శ్రీకాంత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పసుపులేటి పవన్ పూర్ణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతాం ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా .



**పెన్ పవర్, జనవరి, 3**ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో సావిత్రిబాయి పూలే195 జయంతి పురస్కరించుకొని విద్యాసదస్సు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ధర్మ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ధర్మసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ, పాఠశాలలో అభివృద్ధి విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వాములు అవుతూ నిత్యం పాఠశాల కు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందుబాటులో ఉంటూ అన్ని రకాలుగా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతామని అన్నారు. ఇదే పాఠశాలలో 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థి మాచర్ల ఏలియా మాట్లాడుతూ చదువుకున్న రోజులను , తన గురువుల సేవలను గుర్తు చేసుకుంటూ గ్రామంలోని యువత , ఇతర పెద్దలను కలుపుకొని పాఠశాల మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.ఆరవ వార్డు మెంబర్ చిలుక ప్రతిభ , వార్డ్ మెంబర్ ఉల్లెద్దుల సంధ్య, ఇదే పాఠశాలలో వారి పిల్లల చేర్పినాక వారు విద్యా ప్రగతి సాధించారని పాఠశాల తల్లుల కమిటీ సభ్యులగా పాఠశాలకు, పిల్లల శ్రేయస్సుకు వారి తోడ్పాటు అందిస్తామని అన్నారు . .వీరంతా పాఠశాల పరిసర ప్రాంతాలను కలియతిరిగి, పాఠశాల వసతులను పెంచేందుకు కావలసిన ప్రాథమిక ప్రణాళికలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి, వార్డ్ మెంబర్లు అదేవిధంగా సావిత్రిబాయి పూలే వారసులైన పాఠశాల ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ యువత పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, రామకృష్ణ, బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మాధవి, సురేష్ తదితరులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ మమత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సన్మానించిన ట్రస్మ నాయకులు.....



**పెన్ పవర్, జనవరి, 3** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ చౌటుప్పల్ మల్లికార్జున స్కూల్ కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి గారిని మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎలక్షన్లో కొమ్మయిగూడెం సర్పంచిగా ఎన్నికైన సందర్భంగా ట్రాస్మా నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశం మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మల్లారెడ్డి గారు నేడు గ్రామ సర్పంచ్ గా గ్రామాన్ని తీర్చిదిద్ద వలసిన అవకాశం దొరికింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రట్రాస్మా ఉపాధ్యక్షులు కృష్ణారావు గారు, జిల్లా నాయకులు గురునాథపల్లి మల్లేశం,మండల అధ్యక్షులు కృష్ణంరాజు, %వీఎ% సయ్యిద్ షమీము, శ్రీనివాస్, ట్రినిటీ స్కూలు ప్రిన్సిపాల్ మంజుల ,గోదాదేవి, అరుణ, పాల్గొన్నారు.

# అఖ్తర్ పటేల్ కాలని డెవలప్ మెంట్ వర్క్ కొరకు ఎం పి సురేష్ కుమార్ శేట్కార్

ఆదేశం మేరకు హామీ అక్తర్ పటేల్ కాలని డెవలప్ మెంట్ కొరకు హామీ ఇచ్చిన నగేష్ శేట్కార్



**పెన్ పవర్, జనవరి, 3**

1.మూడ సాయిలు పటేల్
2.మొహమ్మద్ మోయినోద్దిన్ ఖురేషి %హీూజ ాతీవంఱఎవత్ చీుతీుఋఅఎప్త్రవఎ%
3.సయ్యద్ అబ్దుల్ యూనుస్ %హీూజ ఎఱఎవ ాతీవంఱఎవత్ చీుతీుఋఅఎప్త్రవఎ%
4.మొహమ్మద్ వహీద్ తాహెర్ సాబ్, %హీూజ +వఅవతీుశ్రీ ావఎతీమ్ఙతీఎ చీుతీుఋఅఎప్త్రవఎ%
5.హబీబ్ అబ్దుల్లా జమాలుల్ లయల్.
6.ఎం ఎ మజీద్ కౌన్సిలర్
7.మొహమ్మద్ సద్దాం .
8.సయ్యద్ అప్సర్ పటేల్
9.ఎం ఎ మొయిద్
10.మొహమ్మద్ పెరోజ్ పటేల్
11.మొహమ్మద్ మౌలానా
12.ఎం ఎ హాజీ
13.సయ్యద్ అబ్దుల్ నుమాన్
14.మొహమ్మద్ మస్తాన్ సాబ్
15.చంద్రమ్మ
16. ఎం ఎ మతీన్
17. మొహమ్మద్ జవ్వాద్
18. గుత్తి రమేష్
19.మొహమ్మద్
20 పయ్యాజ్
21 మేఘారాం
22. యూసుప్ ఖురేషి
23. కొండల రెడ్డి

గార్లు ఇట్టి వెంచర్ డెవలప్ మెంట్ వర్క్ ప్రోగ్రాం లో పాల్గొన్నారు.

ఇట్టి అక్తర్ పటేల్ కాలని లో సిసి రోడ్లు, డ్రైనేజ్ లు, చేయిస్తానని నగేష్ కుమార్ గారు హామీ ఇచ్చారు.

## తొలి ఉపాధ్యాయురాలు, సావిత్రిబాయి పూలే, జయంతి వేడుకలు ఘనంగా



**పెన్ పవర్, జనవరి, 3**చేగుంట / చేగుంట మండల్ పోలంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె జయంతి ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలేసి, నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు, శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ మమత. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేది 195 జయంతి సందర్భంగా భారతీయ సంఘ సంస్కర్తగా, మొదటి ఉపాధ్యాయురాలు ఆమె అనేక సేవలు అందించారు, ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 01న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు అని వారు అన్నారు. ఆమెను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు వినోద, అంగన్ వాడి టీచర్ మమత ఆయా రజిత, బాలికలు బాలురు పాల్గొన్నారు,

## సాయి ఎక్సలెంట్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణ నిజాయితీ అంశాలపై అవగాహన సదస్సు.



**పెన్ పవర్, జనవరి, 3**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని శ్రీ సాయి ఎక్సెంట్ పబ్లిక్ స్కూల్లో సిక్స్ నుంచి నైన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులు వై సురేంద్ర పాల్గొని విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడటం జరిగింది.విద్యతోపాటు విలువలు కూడా ప్రతి విద్యార్థికి అవసరమని ఎంత గొప్ప స్థాయిలో ఉన్న వ్యక్తిగత క్రమశిక్షణ అనేది విద్యార్థి జీవితాన్ని మారుస్తుంది అని పిల్లలకి జీవిత లక్ష్యము కమ్యూనికేషన్స్ స్కిల్ వంటి విషయాల పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయి ఎక్సెంట్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యతో కూడిన విలువలను అందించడంలో శ్రీ సాయి ఎక్సెంట్ స్కూల్ ఎప్పుడు ముందుంటుంది అని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి,ఉపాధ్యాయులు అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాగులవంచశాఖ వారు నాబార్డ్ వారి సౌజన్యంతోకళాజాత ప్రదర్శన.

**పెన్ పవర్, జనవరి, 3**:తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాగులవంచశాఖ వారు నాబార్డ్ వారి సౌజన్యంతో ఖమ్మం రీజినల్ మేనేజర్ వారి ఆదేశాల మేరకు నాగులవంచ గ్రామం లో కళాజాత ప్రదర్శన మ్యాజిక్ షో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బ్యాంకు మేనేజర్ బ్యాంకు మేనేజర్ నాగ సురేష్ ,ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మరియు సాంకేతికత అక్షరాస్యత పై అవగాహన తో పాటుగా
పీఎం జె జె బి వై,ఏపీ వై, జనరల్ ఇన్సూరెన్స్, మరియు సైబర్ నేరాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ లావాదేవీలు , బ్యాంక్ రుణాలు ,స్కీములపై కార్యక్రమంలో



కామెడీ జోక్స్ లతో ప్రజలను కళాకారులు ఆకట్టుకున్నారు. కళాకారులు విభూతి శ్రీనివాసరాజు ,విప్ప ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

**పెన్ పవర్, జనవరి, 3**:దళిత – బహుజన స్త్రీల జనోద్ధరణకు, మహిళా విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమయి శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంపు కార్యాలయం నందు ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.



ఈ సందర్భంగా ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు మరియు కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ,
“భారతదేశంలో మహిళలకు విద్య అనే ఆయుధాన్ని అందించిన తొలి విప్లవ మహిళ సావిత్రిబాయి పూలే. దళిత –%బహుజన స్త్రీలు చదవకూడదని, ప్రశ్నించకూడదని సమాజం ఆంక్షలు విధించిన కాలంలో, ఆ అవమానాలన్నింటినీ ధైర్యంగా తట్టుకుని బాలికలకు పాఠశాలలు ప్రారంభించిన మహానుభావురాలు ఆమె. నేటి మహిళా సాధికారతకు, సామాజిక సమానత్వానికి పునాది వేసిన గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే.
ఆమె బోధించిన ‘విద్యే విముక్తి’ అనే సిద్ధాంతాన్ని తెలంగాణ ఉద్యమ నాయకుడు, ప్రజానాయకుడు కె.సి.ఆర్ పాలనలో ఆచరణలోకి తీసుకువచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన పార్టీ బీఆర్ఎస్.
సావిత్రిబాయి పూలే గారి ఆశయాలను కొనసాగిస్తూ, మహిళల గౌరవం, హక్కులు, విద్య కోసం నిరంతరం పోరాడటం మా బాధ్యత. ఆమె జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆమె ఆదర్శాలను తమ జీవితాల్లో ఆచరించాలి” అని అన్నారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్, కార్పొరేటర్లు తోట గోవిందమ్మ రామారావు, శీలంశెట్టి రామ వీరభద్రం, బుడిగం శ్రీనివాస్, నాగండ్ల కోటి, బుర్రి వెంకట్, కూరాకుల వలరాజు, పల్లా రోస్ లీనా, దాదే అమృత, బిక్కసాని ప్రశాంతి జస్వంత్, జ్యోతి రెడ్డి, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, ధోన్ వాన్ సరస్వతి రవి, గోళ్ళ చంద్రకళ వెంకట్, తోట ఉమారాణి వీరభద్రం, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ వ్యక్తిగత సహాయకులు రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఎర్ర సోమిరెడ్డి గారిని మాజీ ఎమ్మెల్యే గొంగిడిసునీత మహేందర్ రెడ్డి గారు శాలువాతో సత్కరింపు



**పెన్ పవర్, జనవరి, 3**ఆత్మకూరు (%ఎ%)మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా ఎన్నికైన లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి గారిని మాజీ విప్ మాజీ ఆలేరు ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి గారు శాలువతో సత్కరించడం జరిగింది,మాజీ ఎమ్మెల్యే గారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ గారు ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు

# విక్టోరియా కి పలువురు నివాళులు.

**పెన్ పవర్, జనవరి, 3**:మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందినఅన్నే పోగు విక్టోరియా భౌతిక కాయంసందర్శించి ఆమెకు ఘనంగానివాళులు అర్పించినారు. కార్యక్రమంలో
టిఆర్ఎస్ పార్టీ నాయకులు వంకాయలపాటి లచ్చయ్య , రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, కాసాని బుచ్చిబాబు, కొల్లి బాబు, ముప్పిడి వెంకన్న ,తొమ్మిదవ వార్డ్ నెంబరు అనెపోగు రవి, బుసిపోగుఅబ్రహాము,పడిశాల తిరుపతిరావు ,పడిశాల మంగయ్య, పడిశాల రాజేషు, పడిశాల ఉపేంద్ర రావు, అనె పోగు తిరుపతిరావు, గంధం నాగార్జునరావు, కంచర్ల శ్రీను, కంచర్ల సంజీవరావు విక్టోరియా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసినారు.



# జర్నలిస్టుల సంక్షేమమే మా ధ్యేయం: టీజేఏ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణారావు

- జర్నలిస్టుల సమస్యల పై కలెక్టర్ కు వినతి పత్రం
- జిల్లా సమాచార అధికారితో ప్రత్యేక సమావేశం

**పెన్ పవర్, జనవరి, 3**:తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఁజేఏ ) బలోపేతం మరియు జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో కీలక సమావేశం నిర్వహించారు. టీజేఏ జిల్లా అధ్యక్షులు జి ఎన్ స్వామి ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీజేఏ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న టీజేఏను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేయాలని కోరారు.

?క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, హెల్త్ కార్డ్స్, మరియు ఇళ్ల స్థలాల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టులందరూ ఐకమత్యంతో ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమని అన్నారు. వేధింపులు లేదా ఇతర ఒత్తిళ్లకు గురైనప్పుడు అసోసియేషన్ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీజేఏ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందేలా చూడటమే మా లక్ష్యం," అని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు జి. ఎన్ స్వామి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో యూనియన్ విస్తరణకు సభ్యులందరూ సహకరించాలని కోరారు.?

జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

టిజేఏ రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ రావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి,




జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు స్పందించిన కలెక్టర్ అనుదీప్ వర్కింగ్ జర్నలిస్ట్ అందరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

అనంతరం డి పి ఆర్ ఓ కార్యాలయం వెళ్లి డిపిఆర్ఓ గౌస్ పాషా మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు

ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు షేక్ యాకుబ్ పాషా, భూక్య ఉపేందర్, తోమటి గంగాధర్, మత్తి రామకృష్ణ, సంపత్ , మాధవరావు, మహమ్మద్ రహీం తదితరులు పాల్గొన్నారు

# తెలుగు రాష్ట్రాల ప్రజల శ్రేయస్సు కొరకు అద్భుత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన నవీన్ రాథోడ్.

- నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్.



**పెన్ పవర్, జనవరి, 3**ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండల పరిధిలోని నాచారం గ్రామ సమీపాన ఉన్నటువంటి శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈరోజు 2026 నూతన సంవత్సర శు భారంభ సందర్భంగా, కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులచే కొలువబడే నాచారం అద్భుత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శ్రద్ధాభక్తులతో దర్శించుకుని, లోక కల్యాణం, ప్రజా శ్రేయస్సు, శాంతి%-%సమృద్ధి కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్. శ్రీ వేంకటేశ్వర స్వామి కృపతో ఈ నూతన సంవత్సరం అందరికీ సుఖసంతోషాలు, శు భఫలితాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు.

## చింతకాని మండలంలో సిపిఎం పార్టీ నాయకులు అక్రమ అరెస్టు....



**పెన్ పవర్, జనవరి, 3**చింతకాని మండలం సిపిఎం పార్టీ నాయకుల అక్రమ అరెస్టును ఖండించిన సిపిఎం మండల కార్యదర్శి రాచబండిరాము తీవ్రంగా ఖండించారు మధిర పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 10 గంటలకు శాంతియుత ర్యాలీ నిర్వహించాలని పార్టీ డివిజన్ కమిటీ నిర్ణయించి పోలీస్ శాఖ నుండి అనుమతి పొంది జన సమీకరణ కు సిద్ధం అయ్యింది. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకునే హక్కులను తమ పార్టీకార్యకర్తలపై,జరుగుతున్నఅక్రమఅరెస్టులు,నిర్బంధాలను తప్పుడు కేసులను ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న ఈ ర్యాలీని డివిజన్ కమిటీ నిర్ణయించింది దీనిలో భాగంగా సిపిఎం పార్టీ నాయకులను కార్యకర్తలను అర్ధరాత్రి నుండి ప్రతి ఇంటికి వెళ్లి అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ లకు తరలించడం ఎంత అనైతికం దీని ప్రజాస్వామ్య వాదులు ముక్తకంఠంతో ఖండించాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వత్సవాయి జానకి రాములు, కొంౘ్రు జానకిరామయ్య, ఆలస్యం రవి, గడ్డం రమణారావు, బల్లి వీరయ్య, రౌతు అప్పారావు, వీరబాబు, అచ్చయ్య, మడిపల్లి కిరణ్ కుమార్,భయ్య బాలాజీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## నూతన పంచాయతీ భవనానికి పనులు ప్రారంభం....



**పెన్ పవర్, జనవరి, 3** :రాఘవపురం గ్రామపంచాయతీ నూతన భవనం ఎన్ఆర్ఈజీఎస్.. పథకంలో నిధులు మంజూరయ్యాయి... దీనిలో భాగంగా మార్కింగ్ చేసి... పనులు ప్రారంభం చేయటం జరిగింది, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సర్పంచ్ కాంపల్లి కోటమ్మ, ఉప సర్పంచ్ అబ్బూరి మహేష్, వార్డు సభ్యులు దొబ్బల నరసింహారావు, సింగారపు నాగమ్మ, వడ్డే నిరోషా, వడ్లమాని రాంబాబు, కాంపల్లి రమేష్ గ్రామ పెద్దలు కొల్లి గోవిందరావు, కొల్లి రవికుమార్, దొబ్బల బాబు, కొల్లి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి స్కూలు పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేసిన సర్పంచ్ దూసరి నేతాజీ.



**పెన్ పవర్, జనవరి, 3:**చింతకాని సెక్టార్ పరిధిలోని నేరడ గ్రామంలోని గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం చదువుతున్న పిల్లలుకు తెలంగాణ ప్రభుత్వం స్కూల్ యూనిఫామ్ పిల్లలకు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలోని సేవలను వినియోగించవలసిందిగా గర్భిణీలు, బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు సూచించినారు.

అనంతరం సర్పంచ్ దూసరి నేతాజీ, ఉప సర్పంచ్ కోటయ్య సాల్వాతో సత్కరించారు. కార్యక్రమంలో...అంగన్వాడీ టీచర్ పి సరోజిని, కే వెంకమ్మ, వార్డ్ సభ్యులు కేతిబోయిన పుల్లారావు, ఆరోగ్యలక్ష్మి కమిటీ సభ్యులు ప్రీ స్కూల్ తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లు,కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల కొరకు ఉపయోగించే వాహనాల ఫిట్ నెస్ పై దృష్టి సారించాలి.



- సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కృషి చేద్దాం...
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖాధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎస్పీ రోహిత్ రాజు.

**పెన్ పవర్, జనవరి, 3:**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు - 2026 లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. జనవరి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ముందుగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నిర్దిష్ట సైన్ బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించే విధంగా నిత్యం వాహన తనిఖీలు చేపట్టి అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా స్కూళ్లు,కాలేజీలకు విద్యార్థులను తరలించడానికి ఉపయోగించే బస్సులు,వాహనాల విషయంలో ఖచ్చితమైన నియమ,నిబంధనలను పాటించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై,ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై నిత్యం వాహన తనిఖీలు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.పొగమంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ బస్సుల ఫిట్ నెస్ ను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్బి ఇన్స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్,డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాస్,మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్స్ వి.వెంకటరమణ,డి.మనోహర్,అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్స్ ఫారుక్,రాజశేఖర్ రెడ్డి,అశోక్,రాకేష్,శ్వేత,మానస తదితరులు పాల్గొన్నారు.

# 69 వ జాతీయ కబడ్డి పోటీలకు 33 జట్లు రిజిస్ట్రేషన్ పూర్తి.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




**పెన్ పవర్, జనవరి, 3** పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 69వ జాతీయ కబడ్డీ పోటీలు జనవరి 7వ తేదీ నుండి ఘనంగా ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించబడు తున్న ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు జాతీయ స్థాయి విద్యా సంస్థల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన తెలిపారు.

ఈ పోటీలు అండర్ - 17 బాలుర విభాగంలో నిర్వహించబడనున్నాయని, మొత్తం 33 జట్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, బిహార్, అస్సాం, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మణిపూర్, త్రిపుర, గుజరాత్, ఢిల్లీ, చండీగఢ్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో పాటు దాద్రా %డ% నగర్ హవేలీ మరియు డామన్ %డ% డియూ కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని వివరించారు. అదేవిధంగా కేంద్రీయ విద్యాలయ సంఘటన ( కెవిఎస్), నవోదయ విద్యాలయ సమితి( ఎన్ వి ఎస్) సీబీఎస్ఈ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్, సీఐఎస్సీఈ విద్యాభారతి వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థల జట్లు కూడా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టు నుంచి 6 నుంచి 12 మంది క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రత, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ జాతీయ క్రీడా ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరింత పెంచేలా సంబంధిత శాఖలు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు.

# యూరియా స్టాక్ పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ లభ్యం
- రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయవద్దు



**పెన్ పవర్, జనవరి, 3**ఖమ్మం జిల్లాలో 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఏలాంటి అపోహలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

శనివారం జిల్లా కలెక్టర్ , చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద యూరియా కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని, రైతులు అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. మార్క్ ఫెడ్ వద్ద 9,736 మెట్రిక్ టన్నులు, ప్యాక్స్ వద్ద 900 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్స్ వద్ద 663 మెట్రిక్ టన్నులు, గతంలో మన దగ్గర ఉన్న %జత్రా% స్టాక్ 2495 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రతి 2వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒక యూరియా సేల్ పాయింట్ ఉండే విధంగా చర్యలు చేపట్టామని, యూరియా కోసం రైతులు ఏ సమయంలో రావాలో వారికి ముందస్తుగానే సమాచారం అందిస్తూ కూపన్లు కూడా జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన సమయంలో వచ్చి యూరియా తీసుకుని వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఒక రైతు అతని సాగు విస్తీర్ణానికి అవసరమైనయూరియా తప్పకుండా ఇస్తామని దానికంటే అధికంగా యూరియా తీసుకుని వెళ్లకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎవరు ప్రస్తుత అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయవద్దని కలెక్టర్ రైతులకు సూచించారు.ఈ పర్యటనలోలి జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి. పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర, చింతకాని తహసీల్దారు బాజ్జీ ప్రసాద్, నాగులవంచ %ూూజా జజూ% యాలముడి శ్రీనివాసరావు, %ూజూ% దారగాని కల్యాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాఘవాపురం గ్రామంలో శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ అధ్యక్షులు కూరెళ్ల సురేష్

**పెన్ పవర్, జనవరి, 3** రాఘవాపురం గ్రామంలో శ్రమదాన కార్యక్రమం ఆత్మకూరు మండల్ బీఎస్పీ అధ్యక్షుడు కూరెళ్ల సురేష్ అలాగే రాఘవపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్ వార్డ్ మెంబర్స్ గ్రామ ప్రజలు ఆశ వర్కర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# తిరుమలాపురంలో ఎన్ఎస్ఎస్ రెండో రోజు శిబిరం విజయవంతం....






**పెన్ పవర్, జనవరి, 3**చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో జాతీయ సేవా పథకం రెండవ రోజు శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు, అనంతరం జాతీయ మహిళా దినోత్సవం మొట్టమొదటి ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ పిఓ జి. మల్లయ్య మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే సహకారంతో విద్యలభ్యసించారని అదేవిధంగా సమాజంలో బడుగు బలహీన వర్గాలం బాలికల విద్య కోసం కృషి చేశారని, వారు అనేక వివక్షతలు ఎదుర్కొన్నారని అయినా కానీ మహిళల విద్య కోసం పాటుపడిన గొప్ప సాంఘిక సంస్కర్తలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు ఉష, యశోద ,యుపిఎస్ హెచ్ఎం ఎస్. స్వాతి నీ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు ,రాంబాబు ,
వేణుగోపాల్ పాల్గొన్నారు.
సాయంత్రం ఖమ్మం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఎస్డి. సమీన్ ఉమెన్ ఎంపవర్మెంట్
బేటి బచావో-
బేటి పడావో పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రస్తుత సమాజంలో బాలురుతో పాటు బాలికలు కూడా సామాజిక మాధ్యమాల ద్వారా పెడదారులు పడుతున్నారని ఆడపిల్లలు ముఖ్యంగా అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోతున్నారని, ఈ వయసులో తల్లిదండ్రుల మాటలు గౌరవించి జాగ్రత్తగా సమాజంలో మెలగాలని అదేవిధంగా చదువుపై దృష్టి సారించాలని వివరించారు. పని ప్రదేశంలో కూడా ఎవరైనా వేధింపులకు గురి చేస్తే హెల్ప్ లైన్ నెంబర్ కి కాల్ చేయాలని , జిల్లాస్థాయిలో ఒక టీం ఉంటుందని ఈ నెంబర్ కి కాల్ చేసిన వెంటనే రక్షించబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపురం ఉపసర్పంచ్ జి. నాగమణి, వార్డు మెంబర్లు విజయ అరుణ, సిహెచ్. మధు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మధిర స్వేరోస్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**పెన్ పవర్, జనవరి, 3.** స్వేరో సర్కిల్ లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు..
చింతకాని మండలం నాగులువంచ రైల్వే కాలనీ లో స్వేరో సర్కిల్ లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్వేరోస్ మధిర నియోజకవర్గ అధ్యక్షులు శ్యామ్ సుందర్ మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సామాజిక సంస్కర్త మహిళ విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే గారు మహారాష్ట్రలో జనవరి 3 1831లో జన్మించారు చిన్న వయసులోనే జ్యోతిరావు పూలే తో పెళ్లి జరిగిన తర్వాత విద్యను అభ్యసించి తొలి మహిళ పాఠశాలను ప్రారంభించారు ఆ సమయంలో మహిళలకు విద్య అవసరం లేదని భావించేవారు దాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్న సమయంలో ఆమె పైన రాళ్లు మురికి నీరు చల్లడం అవహేళన చేయడం వంటి ఎన్నో అవమానాలు ఎదుర్కొని పేదలకు విద్యను అందించారు కుల వివక్షకు వ్యతిరేకంగా పనిచేశారు బాల్యవివాహాలను అరికట్టడంలో సత్యశోధక్ సమాజ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు ప్లేగు వ్యాధితో బాధపడుతున్న వారికి సహాయ కార్యక్రమాలు చేశారు అదే సమయంలో ఆమె కూడా ప్లేగు వ్యాధితో మరణించారు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న మహిళా ఉపాధ్యాయురాలను అంగన్వాడి టీచర్ కుమ్మర్లపూడి లల్లి వలబజ్జి సుజిత బండి సుజాత కోప్పూరి శైలజ గారిని సన్మానించారు ఈ కార్యక్రమంలో మధిర స్వేరోస్ కమిటీ సభ్యులు శివ స్వేరో శోభ స్వేరో మౌనిక స్వేరో రవి కుమార్ స్వేరో రాజేష్ స్వేరో రమేష్ నవీన్ సిద్దు స్వేరో పాల్గొన్నారు

## చింతకాని మండలానికి మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సీతంపేట గ్రామంలో స్థలాన్ని పరిశీలించడానికి విచ్చేసిన రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు మండల తాసిల్దార్ బాబ్జి ప్రసాద్



**పెన్ పవర్, జనవరి, 3**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు చింతకాని మండలంకు మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సీతంపేట గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అదునైన స్థలాన్ని పరిశీలించడానికి విచ్చేసిన రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు చింతకాని మండల తాసిల్దార్ బాబ్జి ప్రసాద్.

ఈ సందర్భంగా స్థలం విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎన్ఆర్ఐ బయ్యన బాబు కి తాసిల్దార్ మరియు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాషా మరియు గ్రామస్తులు ఆళ్ల రవీందర్, ఆళ్ల అజయ్, కొత్తపల్లి లక్ష్మణ, నలజాల మధు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పై ప్రత్యేక చొరవ...




**పెన్ పవర్, జనవరి, 3:**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆదేశానుసారం, జిఎం యొక్క ప్రత్యేక చొరవతో కొత్తగూడెం ఏరియాలోని వివిధ డిపార్ట్మెంట్ గనులలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు తప్పనిసరిగా సిఎంపిఎఫ్ / ఈపీఎఫ్ నెంబర్ కలిగి ఉండి వారి నెలసరి జీతం నుండి సీఎంపిఎఫ్ / ఈపిఎఫ్ అమౌంట్ రికవరీలపై దశలవారీగా సంబంధిత అధికారులతో సిఎంపిఎఫ్ అధికారులతో రివ్యూ మీటింగ్ ను కండక్ట్ చేసి కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా నెలసరి జీతం (సీఎంపిఎఫ్ / ఈపిఎఫ్ అమౌంట్ రికవరీ) అయి వచ్చేలా చేపట్టడం జరిగింది. తద్వారా కాంట్రాక్టు ఉద్యోగులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చి 2024 వరకు సీఎంపిఎఫ్ రికవరీ అమౌంట్ తెలియజేయు స్లిప్పులను నూతన సంవత్సర వేడుకలలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వడం జరిగింది. అలాగే 2025 సంవత్సరంలో రికవరీ అయినా అమౌంట్ వివరాలను తెలియజేసిన స్లిప్పులను కూడా త్వరితగతిన పంపిణీ చేయుటకు కావలసిన వివరములను సీఎంపీఎఫ్ అధికారులతో చర్చలు జరపడం ద్వారా వీలైనంత తొందరలో మార్చ్/ 2025 వరకు రికవరీ అయిన సీఎంపిఎఫ్ అమౌంట్ వివరములు తెలియజేసే సీఎంపిఎఫ్ స్లిప్ లను ఇవ్వడం జరుగుతుంది మరియు రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా సిఎంపీఎఫ్ సి-కేర్ ఆన్లైన్ పోర్టల్ లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా తమ సమస్సరాంతర బ్యాలెన్సును చూసుకోవడానికి కాంట్రాక్టు ఉద్యోగుల మాస్టర్ డేటా పొందుపరచడాని కి ఏర్పాట్లు చేయవలసిందిగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించడం జరిగింది. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులు ఎవరైనా ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ కు గురై ప్రాణాలు కోల్పోయినట్లయితే వారికి తప్పనిసరిగా యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ అయ్యేలా ప్రతి ఒక్కరికి హెచ్డిఎఫ్సి బ్యాంక్ నందు ఖాతా కలిగి ఉండేలా చర్యలు చేపట్టడం జరిగింది. అలాగే నూతనంగా ప్రవేశపెట్టిన ఈఎస్ఐ సౌకర్యం పై అవగాహన సదస్సు మరియు సభ్యత్వ రిజిస్ట్రేషన్ లను కొత్తగూడెం ఏరియాలోని 10 మంది అంతకన్నా ఎక్కువ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ను కలిగి 21వేల నెలసరి జీతం కన్నా తక్కువ జీతభత్యం కలిగి ఉన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యొక్క కాంట్రాక్టర్లను కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అలాగే వారికి సంబంధిత సింగరేణి అధికారులు, సిబ్బందితో ఈఎస్ఐ సౌకర్యము పై అవగాహన సదస్సును తేదీ.08. అక్టోబర్ .2025 %ఌ% 09. అక్టోబర్ 2025 లలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్, కాన్ఫరెన్స్ హాల్ నందు ఈఎస్ఐసి అధికార బృందం హైదరాబాద్ వారిచే అవగాహన సదస్సుతో పాటు సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్క కాంట్రాక్టు తన దగ్గర పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి ఈఎస్ఐ సౌకర్యాన్ని లబ్ధి పొందేలా చర్యలు చేపట్టారు. తద్వారా సింగరేణి సంస్థల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి అడుగుగా ఈఎస్ఐ (ఉద్యోగుల రాష్ట్ర భద్రతా బీమా) సౌకర్యాన్ని అందించేందుకు సింగరేణి యాజమాన్యం వారు ఈ అవగాహన తన ఏర్పాటు చేశారని ఈ సౌకర్యం కేవలం కార్మికులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకూ వర్తించనుందని, దీని ద్వారా కాంట్రాక్ట్ కార్మికులు మెడికల్ సౌకర్యాలు పొందగలుగుతారని తెలియజేసారు.

## సావిత్రిబాయి స్ఫూర్తితో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలి...



**పెన్ పవర్, జనవరి, 3**దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా కొత్తగూడెం లోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు గారు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే వంటే మహోన్నత వ్యక్తుల జీవితాలు ఆదర్శంగా తీసుకొని సమాజాన్ని బాగు చేసే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని, అటువంటి స్ఫూర్తిని నింపటానికి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్ననాటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ వారు నేర్పిన క్రమశిక్షణ కారణంగానే ఈరోజు ఈ స్థితిలో ఉన్నానని గుర్తు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ ఈరోజు మహిళా ఉపాధ్యాయులను చూస్తుంటే తనకు చిన్ననాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులే గుర్తొస్తున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బోధన కేవలం వృత్తి మాత్రమే కాదని అది ఒక సామాజిక బాధ్యత అని ఆ బాధ్యతను నిర్వహించడం ఉపాధ్యాయులుగా అందరి కర్తవ్యం అని ఉద్బోధించారు. ఈ జయంతి ఉత్సవాల్లో భాగంగా 2026వ సంవత్సరంలో పదవి విరమణ పొందబోతున్న 44 మంది మహిళా ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి గారి సమక్షంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు కొదుమూరు సత్యనారాయణ గారు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు అంకినీడు ప్రసాద్ గారు, జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల టి ఏ,డి ఏ పెంపునకు చర్యలు




- కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వై వెంకయ్య వెల్లడి
- కేయూ పరిధి క్రికెట్ టోర్నీ ప్రారంభం

**పెన్ పవర్, జనవరి, 3** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని క్రీడాకారులకు టి ఏ, డి ఏ, ఇతర ప్రోత్సాహకాలను పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ప్రొఫెసర్ వై వెంకయ్య వెల్లడించారు. శనివారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో కాకతీయ యూనివర్సిటీ పరిధి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు, కోచ్, మేనేజర్ల టీఏ, డీఏల విషయంలో ఇప్పటివరకు ఇచ్చిన దానికంటే అదనంగా మరో 25శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. క్రీడాభివృద్ధి విషయంలో యూనివర్సిటీ వెనకడుగు వేయదని వారిని అన్ని విధాల ప్రోత్సహించి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. కేయూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ జె సోమన్న మాట్లాడుతూ క్రీడాకారులు తమ ప్రతిభను మరింత మెరుగుపరచుకొని యూనివర్సిటీకి మంచి పేరును తీసుకురావాలన్నారు. ఖమ్మం జోన్ క్రీడల కార్యదర్శి డాక్టర్ బి వెంకన్న మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి అత్యధికంగా క్రీడాకారులు యూనివర్సిటీ జట్టుకు ఎంపిక అవుతున్నారని ఇందులో భాగంగానే ఖమ్మం కు ఖమ్మం జోన్ పరిధి, యూనివర్సిటీ స్థాయి క్రికెట్ పోటీలను కేటాయించిందన్నారు. తొలుత జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముందుగా కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వెంకయ్య బ్యాటింగ్ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్లను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఖమ్మం, అదిలాబాద్, వరంగల్ జట్లు పాల్గొన్నారూ ఈ కార్యక్రమంలో డాక్టర్ పి కోటేశ్వరరావు, జే ఉపేందర్, పీడీలు అఫ్జల్, కుమార్, అస్లాం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్టీయూహెచ్ - జేఏసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా వేమూరి హర్ష వర్ధన్ నియామకం



**పెన్ పవర్, జనవరి, 3:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వేమూరి హర్ష వర్ధన్‌ను జెఎన్టీయూహెచ్%-%జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు జెఎన్టీయూహెచ్%-%జేఏసీ చైర్మన్ డా. మంద రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని బోధన, బోధనేతర సిబ్బంది అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వేమూరి హర్ష వర్ధన్ ముందుండి పనిచేస్తారని డా. రంజిత్ కుమార్ పేర్కొన్నారు. విద్యాసంస్థల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ దిశగా ఆయన కృషి చేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ నియామక ఉత్తర్వులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమల్లో ఉంటాయని, ఇవి శుక్రవారం నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వేమూరి హర్ష వర్ధన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.

## సమస్యల పరిష్కారానికై 10వ వార్డులో పర్యటించిన భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ..



**పెన్ పవర్, జనవరి, 3,**భద్రాచల మేజర్ గ్రామ పంచాయతీలోని బ్రిడ్జి సెంటర్ ని ఆనుకొని ఉన్న 10 వ వార్డులోని అయ్యప్ప కాలనీ, రెవిన్యూ కాలనీ ఈరోజు సర్పంచ్ పూనెం కృష్ణ స్థానిక 10వ వార్డు మెంబర్ నిట్టా రాజు తో కలిసి సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో వారు మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల దగ్గర నుంచి తెలుసుకున్న సమస్యలను పరిష్కారం దిశగా తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తామని, కావలసి నటువంటి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి 10 వ వార్డుకు నిధులు ఇస్తానని సర్పంచ్ తెలియజేశారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న సర్పంచ్ పూనెం కృష్ణ ని 10వ వార్డు ప్రజలు శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరేళ్ళ వెంకటేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఒంపోలు దేవకి, 2వ వార్డ్ మెంబర్ బంబోతుల రాజువ్,14వ వార్డు మెంబర్ తిరుమల అశోక్,కాంగ్రెస్ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి రామకృష్ణ, ఆకుల వెంకటరమణ,ఈశ్వర్ రోజు కరుణాకర్, చిటికెన ఉష,దేగల పార్వతి, సిద్ధి దేవవరం,భూక్య నరసింహ, దేగల శివ,హరినాథ్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం లో ఏసీబీ దాడి...

- ఫారెస్టు డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్ పట్టివేత...
- 03 లక్షల 51 వేలు లంచం తీసుకుంటు ఉండగా పట్టుకున్న ఏసీబీ డి. ఎస్పీ రమేష్...



**పెన్ పవర్, జనవరి, 3**టీ ఎఫ్ డి సి ప్లాంటేషన్ మేనేజర్ (ఫారెస్టు రేంజ్ అధికారి) తాడి రాజేందర్, డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణి కాంట్రాక్టర్ వద్ద నుండి జామయిల్ కట్ చేసిన బిల్లులు చెల్లించేందుకు 32 వేల టన్నులకు 28 లక్ష లు 80 వేలు లంచం డిమాండ్. టన్నుకు 750 ప్రభుత్వం ఇస్తుంది. 150 రూ డిమాండ్ చేశారు. 90 రూ" బేరం మాట్లాడుకున్న వైనం. మొదటి యూనిట్ లో 3900 టన్నులు కటింగ్ చేసిన కాంట్రాక్టర్.. ఆ బిల్లులు చేసేందుకు 03 లక్షల 51 వేలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్ పి వై. రమేష్ ఆధ్వర్యంలో లో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.
ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది....

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## వెనిజులాలో అత్యయిక పరిస్థితిని ప్రకటించిన మదురో

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులాలో అధ్యక్షుడు మదురో అత్యయిక పరిస్థితిని ప్రకటించారు. రాజధాని కారకాస్‌పై అమెరికా జరిపిన అత్యంత తీవ్రమైన సైనిక దురాక్రమణగా ఆయన అభివర్ణించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రస్తుత ప్రభుత్వం వెనిజులా భూభాగం మరియు ప్రజలపై చేసిన అత్యంత తీవ్రమైన సైనిక దురాక్రమణను వెనిజులా, అంతర్జాతీయ సమాజం తిరస్కరిస్తుంది మరియు ఖండిస్తుందని పేర్కొన్నారు. నగరం చుట్టూ విమానాల ఫ్లైఓవర్‌లను పోలిన శబ్దాలతో పాటు పలు పేలుళ్ల శబ్దాలు వినిపించాయని స్థానిక మీడియా తెలిపింది. నగరం దక్షిణ ప్రాంతంలోని ప్రధాన సైనిక స్థావరం సమీపంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దేశంలోని అన్ని సామాజిక, రాజకీయ శక్తులు ఐక్యమయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని వెనిజులా ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. సామ్రాజ్యవాద దాడిని తిరస్కరించాలని పిలుపునిచ్చింది. అన్ని జాతీయ రక్షణ ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు.వెనిజులా రాజధాని కారకాస్‌పై జరిగిన వరుస దాడుల వెనుక అమెరికా సైనిక హస్తం ఉందని స్థానిక మీడియా తెలిపింది. అమెరికా దళాలు దాడికి పాల్పడినట్లు పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ట్రంప్ యంత్రాంగానికి చెందిన అధికారులు ధృవీకరించినట్లు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే వైట్‌హౌస్, పెంటగాన్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. వెనిజులాపై దాడులను కంబోడియా ఖండించింది. కారకాస్‌పై జరిగిన క్షిపణి దాడిని కంబోడియా అధ్యక్షుడు గ్వాటావో పెట్రో శనివారం ఖండించారు. ప్రపంచం మొత్తాన్ని హెచ్చరికలా వారు వెనిజులాపై దాడి చేశారని అన్నారు. దాడులపై ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో యుద్ధాల పరంపర కొనసాగుతోంది. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య భీకర దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా సౌదీ అరేబియా-యూఏఈ మధ్య టెన్షన్ వాతావరణం నెలకొంది. యెమెన్‌లో ప్రస్తుతం రెండు వర్గాల మధ్య భీకరపోరు సాగుతోంది. ఇందులో చెరో వర్గానికి సౌదీ అరేబియా-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో యూఏఈ మద్దతుగల దళాలపై సౌదీ అరేబియా దాడులు చేసింది. ఈ ఘటనలో యూఏఈ మద్దతుగల యోధులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే రెండు గల్ఫ్ దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ప్రస్తుతం యెమెన్ విషయంలో రెండు దేశాలు జోక్యం చేసుకుని స్నేహాన్ని చెడగొట్టుకున్నాయి. దక్షిణ, తూర్పు యెమెన్‌లను యెమెన్ ప్రభుత్వం (ఐఆర్‌జీ) పాలిస్తోంది. ఈ సంకీర్ణంలో సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్(ఎస్టీసీ) కీలక భాగస్వామి. అయితే స్వతంత్ర దక్షిణ యెమెన్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఎస్టీసీ ముందుకు సాగడంతో పరిస్థితి ఒక్కసారిగా తారుమారు అయింది. వాస్తవంగా యెమెన్ సమైక్యంగా ఉండాలని సౌదీ భావిస్తోంది.. కానీ ఎస్టీసీ మాత్రం ఆ ప్రయత్నానికి తూట్లు పొడుస్తోంది. ఈ క్రమంలోనే యూఏఈ మద్దతుగల ఎస్టీసీపై సౌదీ దాడులు చేసింది.

## బంగ్లాలో మూకదాడి.. ఖోకోన్ దాస్ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ లో మైనార్టీలైనా హిందువులపై దాడుల జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ 31న 50 ఏండ్ల వ్యక్తి ఖోకోన్ దాస్ పై ఓ బృందం దాడి చేసింది. పదునైన ఆయుధాలతో గాయపరిచింది. అనంతరం నిప్పటించింది. ఈ దాడిలో ఖోకోన్ దాస్ తీవ్రం గా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ మరణించారు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిపై దాడి జరగడం నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో ఘటన. అంతకు ముందు అంటే డిసెంబర్ 18వ తేదీన భాలుకాలో హిందూ వ్యక్తి దీపు చంద్ర దాస్‌ను ఓ గుంపు కొట్టి చంపింది. డిసెంబర్ 30న కూడా మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ వస్త్ర కర్మాగా రంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న హిందూ కార్మికుడిని సహోద్యోగి కాల్చి చంపా డు. ఇలా వరుస దాడులతో బంగ్లాదేశ్‌లోని హిందువుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఉమర్ ఖాలీద్‌కు బెయిలివ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలాంటి విచారణ లేకుండా ఐదేండ్లుగా జైలులో మగ్గుతున్న జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలీద్‌కు బెయిల్ మంజూరు చేయాలని, అంతర్జాతీయ చట్ట నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛగా, సక్రమంగా విచారణ జరిగేలా చూడాలని ఎనిమిదిమంది అమెరికా పార్లమెంట్ సభ్యులు కోరారు. ఈ అంశంపై భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రాకు డిసెంబరు 30న వారు ఒక లేఖ రాశారు. ఉమర్ ఖాలీద్, ఆయన సహ నిందితులపై అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జ్యుడీషియల్ కార్యకలాపాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఖాలీద్‌ను గుర్తు చేసుకుంటూ న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ విడిగా ఒక నోట్ రాశారు. ఖాలీద్ తల్లిదండ్రులతో తన సమావేశాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకున్నారు. డెమొక్రాట్, టామ్‌లాంటోస్ మానవ హక్కుల కమిషన్ ఉపాధ్యక్షులు జిమ్ మెక్‌గవర్న్ ఎనిమిదిమంది సంతకాలతో కూడిన లేఖను షేర్ చేశారు. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో భారతీయ సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్ కూడా వున్నారు. డిసెంబరులో ఉమర్ ఖలీద్ తల్లిదండ్రులను తాము కలుసుకున్న విషయాన్ని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఉపా కింద ఐదేండ్లుగా బెయిల్ కూడా లేకుండా ఖాలీద్‌ను నిర్బంధించారని, ఇది అంతర్జాతీయ ప్రమాణాలను ఉల్లంఘించడమేనని స్వతంత్ర మానవ హక్కుల నిపుణులు హెచ్చరించారని ఆ లేఖ పేర్కొంది. ఖాలీద్ విషయంలో ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు, చట్టపరమైన ప్రక్రియకు సంబంధించి మానవ హక్కుల సంఘాలు, న్యాయ నిపుణులు, అంతర్జాతీయ మీడియా అనేక ప్రశ్నలు లేవనెత్తాయని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని తెలిసిందని పేర్కొన్నారు. సోదరి వివాహానికి హాజరయ్యే నిమిత్తం ఖాలీద్‌కు డిసెంబరు 16 నుంచి 29 వరకు షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ లభించింది.

## ఇరాన్‌లో హింసాత్మక ఆందోళనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ అంతర్గత వ్యవహారంలో జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరించారు. దేశంలో గత వారం నుండి నిరసనలు జరుగుతున్నాయి. దీని వెనకాల అమెరికా ఉందనే విమర్శలున్నాయి. అయితే వారిని అణిచేస్తే ప్రతిస్పందించడానికి వాషింగ్టన్ సన్నద్ధంగా ఉందని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫారమ్‌లో హెచ్చరించారు. వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. గురువారం ఇరాన్‌లోని అనేక నగరాల్లో ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు మరణించినట్లు సమాచారం. రాజధాని టెహ్రాన్‌లోని దుకాణదారులు అధిక ధరలు, ఆర్థిక స్తబ్దతపై ఆదివారం సమ్మెకు దిగారు. దీంతో అల్లర్లు దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించాయి.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ 2018 లో అమెరికా ఆంక్షలను విధించినప్పటి నుండి సవాళ్లను ఎదుర్కొంటుంది. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో అంతర్జాతీయ అణు ఒప్పందం నుండి వైదొలిగిన తర్వాత ఈ ఆంక్షలు విధించారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు. " మా అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం సరికాదు. ఇది గందరగోళానికి, అమెరికా ప్రయోజనాలను నాశనం చేయడానికి సమానమని ఆయనకు (ట్రంప్) తెలిసి ఉండాలి" అని అలీ అన్నారు.

# అశాంతి రగిల్చే 'శాంతి' చట్టం!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల అమల్లోకి వచ్చిన "సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా చట్టం, 2025"పై పౌర సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టం న్యూక్లియర్ పరిశ్రమలో అసురక్షిత పద్ధతులను ప్రోత్సహిస్తుంది, దీని వల్ల భారతపౌరులు న్యూక్లియర్ విపత్తు ప్రమాదానికి గురవుతారు. అలాగే, న్యూక్లియర్ ప్రమాదాల నుంచి ఉత్పన్నమయ్యే భారీ బాధ్యతలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రమాదం కలిగే అవకాశాలే ఎక్కువ. ఈ చట్టం సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 17(బి)ను తొలగిస్తుంది. ఈ సెక్షన్ సరఫరా చేసిన ఉపకరణాలలో దాగిఉన్న లోపాలు లేదా స్పష్టమైన లోపాల వల్ల ప్రమాదం జరిగితే సరఫరాదారులను జవాబుదారీగా చేసేది. ఇది అమెరికా ఒత్తిడి కింద జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు 23 మే 2025న జారీచేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ దేశీయ న్యూక్లియర్ బాధ్యత నియమాలను అంతర్జాతీయ నిబంధనలతో సమలేఖనం చేయాలని అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్‌ను ఆదేశించారు.ఈ నిబంధన తొలగింపు మునుపటి న్యూక్లియర్ ప్రమాదాల నుంచి వచ్చిన శాస్త్రీయ నేర్పులకు విరుద్ధం. ఇప్పటివరకు జరిగిన మూడు ప్రధాన ప్రమాదాలు-ఫుకుషిమా, చెర్నోబిల్, త్రీ మైల్ ఐలాండ్-లలో డిజైన్ లోపాలు ముఖ్య పాత్ర పోషించినట్లు నిరూపితమైంది. శాంతి చట్టం న్యూక్లియర్ సంఘటనకు గరిష్ట బాధ్యతను 300 మిలియన్ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (సుమారు రూ.4,500 కోట్లు)కు పరిమితం చేస్తుంది. కానీ ఇది ఫుకుషిమా విపత్తు శుభ్రపరచడానికి అంచనా వ్యయంలో సుమారు వెయ్యవ వంతు మాత్రమే. అలాగే చెర్నోబిల్ ప్రమాదంలో గోవా పరిమాణంలో ఉన్న ప్రాంతం నివాస యోగ్యం కాకుండా పోయింది. భారత్ దట్టమైన జనాభా కలిగిన దేశం కావడంతో న్యూక్లియర్ విపత్తు నష్టాలు మరింత తీవ్రంగా ఉండవచ్చు. ఈ స్వల్ప బాధ్యత పరిమితి అటువంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి అపర్యాప్తం. ఈ మొత్తం కేంద్ర ప్రభుత్వం, న్యూక్లియర్ ప్లాంట్ ఆపరేటర్ మధ్య విభజించబడుతుంది. ఆపరేటర్ బాధ్యత ప్లాంట్ పవర్ అవుట్‌పుట్ ఆధారంగా గ్రేడ్ చేయబడింది.చిన్న ప్లాంట్లు (150 ఎండబ్ల్యూఈ కంటే తక్కువ) ఆపరేటర్లకు ప్రమాదం ఎంత నష్టం కలిగించిన గరిష్ట బాధ్యత రూ.వంద కోట్లు మాత్రమే. అయితే, చిన్న న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణం, నిర్వహణ వ్యయం ఈ మొత్తాన్ని ఎన్నోరెట్లు మించిపోవచ్చు. ఆపరేటర్ గరిష్ట జరిమానా చెల్లించి భద్రత లోపాలను సరిచేయకుండా ఉండే అవకాశం ఉంది, ముఖ్యంగా శాంతి చట్టం లాభాపేక్షతో కూడిన ప్రయివేట్ ఆపరేటర్లకు తలుపులు తెరిచింది. శాంతి చట్టం అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్‌ను ప్రస్తుత రూపంలోనే కొనసాగిస్తుంది. అంతేకాకుండా, దాని సభ్యులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీ అధ్యక్షత వహించే అటామిక్ ఎనర్జీ కమిషన్ నియమిస్తుంది. అంటే, రెగ్యులేటర్‌ను నియమించేది దాని సౌకర్యాలను రెగ్యులేట్ చేయాల్సిన సంస్థే. శాంతి చట్టం 2012లో పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన విలువైన సూచనలను పట్టించుకోలేదు. దీనివల్ల ఎన్డీయే ప్రభుత్వం న్యూక్లియర్ రెగ్యులేటర్‌కు స్వతంత్రత ఇవ్వడానికి ఎటువంటి ఉద్దేశం లేదని మాట్లాడటం, న్యూక్లియర్ రియాక్టర్ల సమీపంలో నివసిస్తున్న ప్రజల భద్రతపై పూర్తి నిర్లక్ష్యం వహించడమే అవుతుంది. చట్టం సెక్షన్ 39(4) న్యూక్లియర్ సౌకర్యాలపై సమాచారం పొందే పౌరుల హక్కును రద్దుచేస్తుంది, న్యూక్లియర్ రంగాన్ని ప్రయివేట్, విదేశీ వ్యాపారస్తులకు అనుకూలతకు ఎక్కువ ఉపయోగపడుతుంది. నిబంధన అవకాశాలు, దుర్వినియోగానికి తావిస్తుంది. దేశ న్యూక్లియర్ ఫ్రేమ్‌వర్క్‌ను పూర్తిగా మార్చే ఈ ముఖ్యమైన చట్టం స్వల్ప పార్లమెంటరీ చర్చతో, పార్లమెంటరీ కమిటీ పంపకుండా ఆమోదించబడి నందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బిల్ టెక్స్ట్ 2025 డిసెంబర్ 15న అందుబాటులోకి వచ్చింది, 17నాటికి లోక్‌సభ ఆమోదించింది, 18 నాటికి రాజ్యసభ ఆమోదించింది. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తుంది, ఎందుకంటే పౌరులు లేదా శాసనసభ్యులు చట్టాన్ని పరిశీలించి, వ్యాఖ్యానించే సరిపడా సమయం లభించలేదు. శాంతి చట్టం ప్రభుత్వం దిగుమతి చేసుకున్న లైట్-వాటర్ రియాక్టర్లపై ఆధారపడి న్యూక్లియర్ రంగాన్ని పెంచాలని నిర్ణయించినట్లు చూపిస్తుంది. అయితే, అటువంటి రియాక్టర్లు, దిగుమతి యూరేనియంపై పెద్దఎత్తున ఆధారపడటం విద్యుత్ ధరలు పెరగడానికి, భారత్ శక్తి స్వావలంబనపై ప్రతికూల ప్రభావం చూపడానికి దారితీస్తుంది.

# విశ్వరహస్యాలను ఛేదించిన న్యూటన్

**హైదరాబాద్ పెన్ పవర్:** అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు.మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం.విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి.గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వవిద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచేవారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీ లో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారుచేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, టశ్రీబీలీతినీనిబ యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు ? ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి.

**(1).మొదటి సూత్రము...**

"బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము...

"ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3).న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది. మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు. తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

# నువ్వు భారతీయుడివా కాదా ? ఈ పరికరం చెప్పేస్తుంది జాగ్రత్త!

**హైదరాబాద్ పెన్ పవర్:** "నువ్వు బంగ్లాదేశీ జాతీయుడివా? నువ్వెవరనేది నువ్వు చెప్పకపోయినా ఈ పరికరం చెప్పేస్తుంది? అని భయపెడుతూ ఒక పోలీసు అధికారి ఒక వ్యక్తి వీపుపై స్మార్ట్ ఫోన్‌లా కనిపిస్తున్న ఒక పరికరాన్ని పెట్టి అక్కడ మురికివాడలోని నిరుపేద ప్రజలను బెదిరిస్తున్న వీడియో తాజాగా వెలుగుచూసింది. 'మీరు అక్రమంగా వలస వచ్చారో లేదో ఈ పరికరం చెప్పేస్తుంది' అంటూ వారిని బెదిరించడం అందులో కనిపిస్తోంది. అటువైపు వ్యక్తి మాత్రం తాను బీహార్‌లోని అరారియా జిల్లాకు చెందిన వాడినని చాలా గట్టిగా చెప్పడం వినిపించింది. ఆ పోలీసు అధికారి ఉత్తర ప్రదేశ్ ఘజియాబాద్‌లోని కౌశాంబి పోలీసు స్టేషన్‌కు చెందినవారు కాగా, పోలీసులు రోజువారీ సాగించే తనిఖీల కార్యక్రమంలో భాగంగా ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. అధికారాన్ని ఉపయోగించి పేద ప్రజల హక్కులపై దాడి చేస్తున్న ఈ తీరు పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.విదేశీ అక్రమ వలసదారులను గుర్తించడమే లక్ష్యంగా ఒకపక్క ఎన్నికల కమిషన్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టగా, మరోపక్క పోలీసులు కూడా ఈ విషయంలో పలుచోట్ల పలు రకాలుగా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లో, ఈశాన్య రాష్ట్రాల్లో అనేకమందిని బంగ్లాదేశ్ నుండి వలస వచ్చారనే పేరుతో బలవంతంగా తరలించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఘజియాబాద్ పోలీసు అధికారి ఒకరు పాల్పడిన చర్య సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# 'స్వచ్ఛ నగరం'లో మృత్యు జలాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భోపాల్ : బిజెపి డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలోని మధ్యప్రదేశ్ స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించలేకపోతోంది. దేశంలో 'స్వచ్ఛనగరం'గా ఎనిమిదిసార్లు అవార్డు అందుకున్న ఇండోర్ నగరంలోని భగీరథపురాలో కలుషితమైన నీటిని తాగి మరణించిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 15కి పెరిగింది. వీరిలో ఆరు నెలల చిన్నారి కూడా ఉంది. ఈ మున్సిపల్ కార్పొరేషన్ సరఫరా చేసిన నీటిని తాగి గత 10 రోజుల్లో రెండు వేల మందికి పైగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. గురువారం వరకూ 272 మంది ఆసుపత్రుల్లో చేరారని, 71 మంది డిశ్చార్జి అయ్యారని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. 32 మంది రోగులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ప్రార్థనలు, మొక్కుల తరువాత పదేళ్లకు పుట్టిన బిడ్డ మరణించాడని భగీరథ్‌పురాలోని మరాఠీ మొహల్లాలో బాలుడు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఆరు నెలల చిన్నారి అవ్యాన్ సాహు అమ్మమ్మ కృష్ణ సాహు మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి పరహారం తీసుకోలేదు. మా బిడ్డ పోయాడు. పరిహారం తనను బతికిస్తుందా? డబ్బు కంటే మా బిడ్డ గొప్పవాడు' అంటూ రోదించారు. పెళ్లయిన పదేళ్లకు ఎన్నో మొక్కుల తర్వాత తన కూతురుకు బిడ్డ పుట్టాడని, ఇంతలోనే కలుషిత నీటి వల్ల మరణించాడని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన పాలపొడిలో మున్సిపల్ కుళాయి నీటిలో కలిపి ఇవ్వడమే ప్రాణం తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా, తిరస్కరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కలుషిత నీటి వల్ల ఏ తల్లీ బిడ్డను కోల్పోకుండా చూడాలని అదే ప్రాంతానికి చెందిన అనితా సేన్ కోరారు. ఇప్పటికైనా స్వచ్ఛమైన నీటిని అందించాలని అన్నారు.

# ఆఫ్ఘనిస్తాన్ లో ఆకస్మిక వరదలు ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వరదలు కారణంగా 17 మంది మృతి చెందారని, 11 మంది గాయపడినట్లు ఆఫ్ఘానిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. హెరాత్ ప్రావిన్స్‌లోని కబ్కాన్ జిల్లాలో గురువారం ఒక ఇంటి పైకప్పు కూలిపోవడంతో ఐదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. మధ్య, ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో నష్టం అధికంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. వరదలు కారణంగా పశువులు కూడా చనిపోయాయి. వరద ప్రభావం 1,800 కుటుంబాలపై పడిందన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. వరద తీవ్రతను అంచనా వేయడానికి బృందాలను పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా చాలా కాలంగా వర్షాలు లేక కరువు పరిస్థితులు ఎదుర్కొంటుంది. భారీ వర్షాలు కురిసిప్పటికీ ఆకస్మిక వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు పరిస్థితి మరింత దారుణంగా మారింది.

## నలుగురు మహిళలు సహా 18 మంది అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** అస్సాంలోని కర్బిఅంగ్లాంగ్‌జిల్లాలో క్షుద్రవిద్యలకు పాల్పడుతున్నారనే అనుమానంతో భార్యాభర్తలను హత్య చేసిన కేసులో 18మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో నలుగురు మహిళలు కూడా ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారి అఖిలేష్‌కుమార్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించామని, ఇటువంటి దారుణ ఘటనల్లో నేరస్థులను వదిలేది లేదని అన్నారు. ఆధారాలు సేకరించామని, ఇప్పటివరకు 18మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కొన్ని నెలల క్రితం శివసాగర్‌లో ఇదేతరహా కేసులో 23మందికి కోర్టు జీవితఖైదు విధించిందని, ఈ కేసులోనూ న్యాయం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ 30న రాత్రి 8.25 గంటల సమయంలో హవ్రాఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ నెం.1 బెలోగురి ముండాగావ్‌లో క్షుద్రపూజలకు పాల్పడుతున్నారనే అనుమానంతో గ్రామస్తులు ఇద్దరు భార్యభర్తలను హత్య చేసి మంటల్లోకి తోసేసిన సంగతి తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకునే సమయానికి వారిద్దరూ మంటల్లో కాలి బూడిదయ్యారు. నిందితులపై సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు, బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్‌లను కూడా దాఖలు చేశారు.

# గిగ్ కార్మికుల సామాజిక భద్రతకు 90 రోజుల పని నిబంధన



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు సంబంధించిన సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద మొత్తం 120 రోజులు పనిచేయాలి. ఇటీవల గిగ్‌వర్కర్లు సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఒక రోజుకు ఒక అగ్రిగేటర్ వద్ద పని చేసినా,ఆ రోజు మొత్తం ఒక రోజుగా పరిగణలోకి వస్తుంది. ఒక గిగ్‌వర్కర్ అగ్రిగేటర్ కోసం చేసిన పనికి ఆదాయం సంపాదిస్తే, వారు ఎంత సంపాదించారనే దానితో సంబంధం లేకుండా, ఆ రోజున వారు పనిలో చేసినట్లుగా పరిగణలోకి వస్తుందని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ముసాయిదా నిబంధనలకు సంబంధించి తుది నోటిఫికేషన్‌కు ముందు అభిప్రాయాలు చెప్పాలని కేంద్రం కోరింది. 30-45 రోజుల వ్యవధిలో అభ్యంతరాలు మరియు సూచనలను ఆహ్వానించింది. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్‌లలోని అన్ని నిబంధనలను పూర్తిగా అమలు చేయాలనే కార్మిక మంత్రిత్వ శాఖ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇటీవల డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న గిగ్‌వర్కర్లు సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను వారు డిమాండ్ చేశారు. అలాగే, 10 నిమిషాల్లో డెలివరీ విధానాన్ని పూర్తిగా చేయాలని డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి 1 నుంచి కొత్త ఫాస్టాగ్ నిబంధనలు




**హైదరాబాద్ పెన్ పవర్:** నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి కార్లు, జీపులు, వ్యాన్లు సహా అన్ని వాహనాలకు నో యువర్ వెహికల్ (కేవైవీ) ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫాస్టాగ్ కస్టమర్ల సౌకర్యాన్ని మెరుగుపరచడం, హైవేలో వారు ఎదుర్కొంటున్న యాక్టివేషన్ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అన్ని పత్రాలు ఉన్నప్పటికీ కేవైవీ ప్రక్రియ వల్ల ఫాస్టాగ్ యాక్టివేషన్ కోసం ఎక్కువ సమయం వృధా అవుతోందని, అందుకే ఈ నిబంధనను తెచ్చినట్టు ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు సైతం కేవైవీ అవసరంలేదని పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, ఫాస్టాగ్ కనిపించే విధంగా లేకపోవడం, పొరపాట్లు ఉండటం, దుర్వినియోగం కావడం వంటి సందర్భాల్లో మాత్రమే కేవైవీ తప్పనిసరి. సాధారణ కస్టమర్లకు ఇక దీని అవసరం ఉండదు. అలగే, వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధృవీకరించి ఫాస్టాగ్ ఇచ్చే సమయంలో బ్యాంకులు యాక్టివేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాయి. ఒకవేళ డేటాబేస్‌లో వివరాలు లభించకపోతే, ఆర్‌సీని ఆధారంగా వెరిఫికేషన్ చేస్తాయి. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ఫాస్టాగ్‌లకూ ఇదే విధానం వర్తిస్తుంది. ఇప్పటివరకు వాహనానికి సంబంధించి ముందు, సైడ్‌వ్యూ ఫోటోలతో పాటు ఆర్‌సీ, విండ్‌షీల్డ్‌పై ఫాస్టాగ్ స్టిక్కర్ ఫోటోలో అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు తొలగనున్నాయి.

## పాలసీల పునరుద్ధరణకు ఎల్ఐసీ ఆఫర్

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తమ పాలసీదారులకు శుక్రవారం ఓ స్పెషల్ ఆఫర్ ఇచ్చింది. ఆగిపోయిన వ్యక్తిగత పాలసీల పునరుద్ధరణకు అవకాశం కల్పించింది. 2 నెలలపాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగనున్నది. మార్చి 2దాకా అన్ని నాన్-లింక్డ్ లాప్స్‌డ్ పాలసీలకు ఆలస్య రుసుములో ఆకర్షణీయ రాయితీతో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. సదరు బీమా ప్లాన్లకు అర్హత ఉంటే లేట్ ఫీజులో గరిష్ఠంగా రూ.5వేలు లేదా 30 శాతం వరకు తగ్గింపును పొందవచ్చని ఓ ప్రకటనలో ఎల్ఐసీ తెలిపింది. కాగా, మైక్రో ఇన్సూరెన్స్ పాలసీల కోసం ఆలస్య రుసుమును సంస్థ పూర్తిగా ఎత్తేసింది. అయితే మెడికల్/ఆరోగ్య అవసరాలపై మాత్రం ఎలాంటి రాయితీలు ఉండవని ఎల్ఐసీ స్పష్టం చేసింది. పాలసీదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తెచ్చిన ఈ సదవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలన్నది. ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రీమియంలు సకాలంలో చెల్లించలేక ఆగిపోయిన పాలసీలకు చక్కని అవకాశంగా ఎల్ఐసీ ఈ సందర్భంగా పేర్కొన్నది.

## ఆకాశమూ అదానీకే !




**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశీ విమానయాన కంపెనీలకు భారత గగనతలాన్ని పూర్తిగా తెరిచిపెట్టాలని అదానీ గ్రూపు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. ఇటీవల పలు దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాల్లో విదేశీ కంపెనీలకు అనుమతులివ్వాలని కోరినట్లు ఆంగ్లడియాలో విస్తృతంగా కథనాలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై భారత్‌కు చెందిన రెండు అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.తమ సిఫార్సులకు విరుద్ధంగా అదానీ ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపాయి. విదేశీ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడం వల్ల పశ్చిమ ఆసియాలోని భారీ నగదు నిల్వలున్న విమానయాన సంస్థల నుంచి తాము తీవ్రమైన, అన్యాయమైన పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది.ముంబయి నగరాన్ని అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మార్చడానికి విదేశీ విమానాలకు విరివిగా అనుమతివ్వడం ద్వారా సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అదాని గ్రూప్ గత నెలలో ప్రభుత్వానికి తెలిపినట్లు ఎకనామిక్ ట్స్ నివేదిక పేర్కొంది. 2030 నాటికి టెర్మినల్స్, రన్‌వేలు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు, ప్రయాణికుల సౌకర్యాల కోసం 11.1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1 లక్ష కోట్లు) ఖర్చు చేయాలని అదాని గ్రూప్ యోచిస్తోందని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ డైరెక్టర్ జీత్ అదానీ ఇటీవల పేర్కొన్నారు. "ప్రయాణికులకు మరిన్ని ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావడం అనేది భారతీయ విమానాశ్రయాలను ప్రపంచస్థాయి హబ్‌లుగా మార్చడంలో కీలకమైన అంశం. ఇది భారతీయ విమానయాన సంస్థలు పోటీకి సిద్ధంగా ఉన్నాయా లేదా అనే దానిపై మాత్రమే ఆధారపడి ఆలోచించకూడదు. అంతర్జాతీయ విమాన కంపెనీల కు అనుమతివ్వకపోవడం వల్ల విమానాశ్రయాల ఆస్తులను వృథా చేయడమే అవుతుంది." అని అదాని కంపెనీ అధికారి పేర్కొన్నారు.

# రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల డియా కథనాలు వెల్లడించాయి. 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. దీనిపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే భారత్‌పై 50 శాతం సుంకాలు వేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో తన వాణిజ్య లోటును తగ్గించుకోవాలని చూస్తోన్న యూఎస్ఏ.. వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా టారిఫ్‌ల ద్వారా భారత్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ పరిణామాల వేళ.. రష్యా, అమెరికా చమురు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (ఖఖంఅ) రిఫైనరీలను అడిగింది. ఈ సమాచారం ఇవ్వాలని పీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాతో చర్చల సమయంలో ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకుంటుందని డియా కథనాలు పేర్కొన్నాయి.

# 2026లో బంగారం ధరలపై ఆర్థిక నిపుణుల అప్‌డేట్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది తొలి రోజునే అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. డిసెంబర్ 26న స్పాట్ గోల్డ్ ఔన్సుకు ఆల్‌మ్ రికార్డు స్థాయి 4,549.71 డాలర్లకి చేరిన తర్వాత.. కొద్దిరోజుల లాభాల స్వీకరణ కారణంగా ధరలు తగ్గాయి. అయితే 2026 ప్రారంభంతో మళ్లీ బులియన్‌లో కొనుగోళ్ల జోరు పెరిగింది. గురువారం నాటికి స్పాట్ గోల్డ్ ధర దాదాపు 2 శాతం పెరిగి ఔన్సుకు 4,397.66 డాలర్ల వద్ద ట్రేడైంది. అంతకుముందు బుధవారం ఇది రెండు వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇక ఫిబ్రవరి డెలివరీకి సంబంధించిన అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ కూడా 1.6 శాతం పెరిగి ఔన్సుకు 4,409.90 డాలర్లకి చేరాయి. ఇది పెట్టుబడిదారుల్లో ఉనిశ్రీట పట్ల ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఈచీఓ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ లుక్మాన్ ఒటునుగా అభిప్రాయం ప్రకారం.. విలువైన లోహాలు 2026ను సానుకూలంగా ప్రారంభించాయి. 2025 చివర్లో జరిగిన లాభాల స్వీకరణ తర్వాత.. ఇప్పుడు భౌగోళిక రాజకీయ ప్రమాదాలు, ఈ ఏడాది అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గవచ్చున్న అంచనాలు బంగారానికి మద్దతుగా మారాయని తెలిపారు. ఇక భౌతిక బంగారం డిమాండ్ విషయానికి వస్తే.. దాదాపు రెండు నెలల తర్వాత తొలిసారిగా భారత్, పొరుగుదేశం చైనాలో బంగారం ప్రీమియంతో ట్రేడవుతోంది. ఆల్‌మ్ గరిష్ట స్థాయిల నుంచి ధరలు కొంత దిద్దుబాటుకు గురవడంతో.. రిల్ కొనుగోలుదారులు మళ్లీ మార్కెట్‌లోకి వచ్చారు. పెళ్లిళ్ల సీజన్, పండుగల డిమాండ్ కూడా భారత్‌లో బంగారం కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తోంది. 2025 సంవత్సరం బంగారం ధరలు పెరిగి పెట్టుబడిదారులకు లాభాల పంటను పండించాయి. ఆ ఏడాదిలో బులియన్ ధరలు ఏకంగా 64 శాతం పెరిగాయి. ఇది 1979 తర్వాత అతిపెద్ద వార్షిక లాభంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతలు, ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లు, అలాగే గోల్డ్ ఇఁఈలలో పెరిగిన పెట్టుబడులు ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఃc విశ్లేషకుడు జియోవన్నీ స్టానోవో అభిప్రాయం ప్రకారం.. 2026లో బంగారం ధరలు మరింత పైకి ఎగబాకే అవకాశం ఉంది. ఔన్సుకు 5,000 డాలర్ల స్థాయిని లక్ష్యంగా పెట్టుకున్నాం. తక్కువ వాస్తవ వడ్డీ రేట్లు, ప్రపంచ ఆర్థిక ఆందోళనలు, అలాగే అమెరికా దేశీయ విధానాలపై ఉన్న అనిశ్చితి బంగారానికి అనుకూలంగా మారుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర బ్యాంకులు, పెద్ద పెట్టుబడిదారులు కౌంటర్‌పార్టీ రిస్క్‌కి దూరంగా ఉండేందుకు బంగారం వంటి నిజమైన ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ ఏడాది కనీసం రెండు సార్లు ఫెడ్ క్వార్టర్ పాయింట్ రేటు కోతలు చేయవచ్చని మార్కెట్ అంచనా వేస్తోంది. తక్కువ వడ్డీ రేట్ల వాతావరణంలో దిగుబడి లేని ఆస్తులు అయిన బంగారం లాంటి లోహాలు మెరుగైన ప్రదర్శన చూపుతాయని భావిస్తున్నారు. బంగారంతో పాటు ఇతర విలువైన లోహాలు కూడా బలంగా కదిలాయి. సోమవారం ఆల్‌మ్ హై 83.62 డాలర్లని తాకిన తర్వాత స్పాట్ సిల్వర్ ఔన్సుకు 4.6 శాతం పెరిగి 74.52 డాలర్లకి చేరింది. ప్లాటినం కూడా ఇటీవల 2,478.50 డాలర్ల రికార్డు స్థాయికి చేరిన తర్వాత ఔన్సుకు 2,150.46 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి 2025లో 147 శాతం లాభాలను నమోదు చేయగా, పల్లాడియం గత ఏడాది 76 శాతం పెరిగి 15 ఏళ్లలో అత్యుత్తమ ప్రదర్శన చూపింది.

# ఆరావళి కొండలపై అనకొండల చూపు

**హైదరాబాద్ పెన్ పవర్:** సహజ వనరులనేవి దేశ సంపదకు, అభివృద్ధికి నిలయంగా ఉంటాయి. వాటిని ప్రజల అవసరాల మేరకే ఉపయోగించాలి. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం మాత్రం దేశ సహజ వనరులైన అడవులను, ఖనిజాలను, గనులను, నదులను చివరికి కొండలను కూడా దేశవిదేశీ బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నది. అందులో భాగమే ఆరావళి కొండల్లో మైనింగ్ తవ్వకాలు. ఈ తవ్వకాలకు వ్యతిరేకంగా గిరిజనులు, గిరిజనేతరులు, పర్యావరణ వేత్తలు సుదీర్ఘకాలం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఆరావళి కొండలకు ఇచ్చిన నిర్వచనానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆరావళి పశ్చిమ భారతదేశం లోని ఒక పర్వతశ్రేణి. ఇది గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ మీదుగా ఈశాన్యంగా 8 వందల కిలోమీటర్ల మీద విస్తరించి ఉంది. ఇది గొప్ప భౌగోళిక చరిత్రకలిగి ప్రపంచంలోని పురాతన పర్వతశ్రేణుల్లో ఒకటి. వృక్షజాలం, జంతుజాలం, ముఖ్యమైన పర్యావరణ ప్రాంతంగా ఉంది. పాలరాయి, గ్రానైట్, మైకా, రాగి, జింక్, సీసం వంటి ఖనిజాలతో ఆరావళి నిండి ఉంది. ఈ పర్వతాలు పొరుగు ప్రాంతాలకు మంచినీరు అందిస్తాయి. వివిధ కొండలు, కోటలు, దేవాలయాలు, చారిత్రక నిర్మాణాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఈ పర్వతాలు థార్ ఎడారిలోని ఇసుక తుఫాన్లను అడ్డుకుంటాయి. అక్రమ మైనింగ్: గత నాలుగు దశాబ్దాలుగా ఆరావళి కొండల్లో అక్రమ మైనింగ్‌తోపాటు అటవీ నిర్మూలన పెద్ద ఎత్తున జరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కంపెనీలకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. గతంలో అడవి గురించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన నిర్వచనం ఉండటం వల్ల కొన్ని రాష్ట్రాలు మైనింగ్‌ని నిషేధిస్తే, కొన్ని రాష్ట్రాలు అనుమతించాయి. ఈ పరిస్థితి మైనింగ్ మాఫియాకు అనుకూలంగా మారింది. గురుగ్రా, ఫరీదాబాద్, నుహ్, మహేంద్ర గడ్ వంటి నగరాల మాస్టర్ ప్లాన్ కింద వాటిని ఆరావళి పరిధి నుంచి మినహాయించడానికి హర్యానా శాసనసభ 27-2-2019న భూసంరక్షణ చట్టాన్ని సవరించింది. దీనివల్ల ఆరావళి కొండల్లో దాదాపు 25 వేల హెక్టార్ల అటవీ ప్రాంతాలు మైనింగ్ కార్యకలాపాలకు వీలు కల్పించింది. అప్పటికే జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను కూడా చట్టబద్ధం చేసింది. టీవల మోడీ ప్రభుత్వం భూమట్టానికి 100 మీటర్ల లోపు కూడా ఆరావళి పర్వత శ్రేణులను మైనింగ్ లీజుకు ఇచ్చేందుకు నిబంధనలను సడలించింది. 1,47,00

0 చదరపు కిలోమీటర్లు ఉన్న ఆరావళి శ్రేణుల్లో కేవలం 2% మాత్రమే తవ్వకాలు జరుగుతాయని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేద్ర యాదవ్ చెబుతూ, మైనింగ్ తవ్వకాలను సమర్థించుకున్నాడు. దీనిపై పర్యావరణవేత్తలు సుప్రీం కోర్టుకు వెళ్లగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ, వంద మీటర్ల ఎత్తు లోపు ఉన్న కొండలను, కొండలుగా పరిగణించలేమని అక్కడ మైనింగ్ చేసుకోవచ్చని, మిగతా ప్రాంతంలో మైనింగ్ ని నిషేధించాలని నవంబర్ 2025న తీర్పు ఇచ్చింది. ఆరావళి పర్వత శ్రేణులపై కేంద్ర ప్రభుత్వ, సుప్రీం కోర్టుల నిర్వచనంపై దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లమీదకు వచ్చి ఆందోళనలు చేశారు. రాజస్థాన్‌లో జరిగిన వ్యతిరేక ఆందోళనలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనేక మంది మేధావులు, పర్యావరణ వేత్తలు తప్పుపట్టారు. సుప్రీం కోర్టు తీర్పులు విచిత్రంగా ఉన్నాయి. ఒకసారి ఇచ్చిన తీర్పుకి భిన్నంగా, అదే అంశం మరో తీర్పు ఇవ్వడమే విచిత్రం. 2018లో చట్ట విరుద్ధమైన మైనింగ్‌ను ఆపాలని, అక్రమ మైనింగ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మైనింగ్ ప్రాంతాలను సరిగా గుర్తించాలని, ఆరావళి ప్రాంతంలోని ప్రతి చిన్నరాయి, గుట్ట పర్వతం కిందకే వస్తుందని పేర్కొంది. అక్రమ మైనింగ్ వల్ల రాజస్థాన్, హర్యానాలో 31 కొండలు మాయమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. 2025 మేలో కూడా మైనింగ్‌ని నిషేధించాలని చెప్పింది. అందుకు విరుద్ధంగా నవంబర్ 2025లో తీర్పు ఇచ్చింది. ఇలా పరస్పర విరుద్ధమైన తీర్పులు సుప్రీం కోర్టు నుండి వచ్చాయి. ప్రజా ఉద్యమ నేపథ్యంలో 2025 నవంబర్ లో తాను ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకున్నట్లు తిరిగి సుప్రీం కోర్టు ప్రకటించి మైనింగ్ నిషేధించాలని పేర్కొంది. నెలలోనే రెండు విరుద్ధమైన తీర్పులు సుప్రీం కోర్టు నుంచి వెలువడ్డాయి. ఆరావళిలో మైనింగ్ చేస్తున్న ముఖ్యమైన కంపెనీలు అరవాలి గ్రూప్, ఫ్యాబ్ స్టోన్, హిందూస్థాన్ జింక్, వేదాంత సంస్థలు కాకుండా ఇంకా అనేక పెద్ద, చిన్న కంపెనీలు ఉన్నాయి. అక్రమ మైనింగ్ ఫలితంగా పర్వతాల, అటవీ నిర్మూలనతోపాటు పర్యావరణానికి తీవ్రనష్టం జరుగుతుంది. చిన్న కొండలకు రక్షణ ఉండదు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. థార్ ఎడారి ఇసుక తుఫాన్లకు ప్రజలు గురవుతారు. ప్రజాఉద్యమం మూలంగా మోడీ ప్రభుత్వం మైనింగ్‌ని నిషేధించామని చెప్పినా, సుప్రీం కోర్టు తన తీర్పు ను ఉపసంహరించుకున్నా ఆరావళి పర్వతాలకు ప్రమాదం పొంచే ఉంది. బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే ముఖ్యమని భావించే మోడీ ప్రభుత్వం మైనింగ్ తవ్వకాలను ఆపుతుందని ఆశించలేం. సుదీర్ఘ ప్రజాఉద్యమమే మైనింగ్ తవ్వకాలను ఆపగలదు.

# ప్రతి చిన్న విషయాన్ని వాట్సాప్ స్టేటస్‌లో షేర్ చేస్తున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉదయం లేవగానే పలకరించే కాఫీ కప్పు దగ్గర మొదలుపెట్టి.. రాత్రి పడుకునే ముందు చూసే వెన్నెల దాకా, ప్రతి చిన్న విషయాన్ని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడం ఇప్పుడు ఒక ట్రెండ్‌గా మారింది. కొందరైతే ఏకంగా తమ వ్యక్తిగత గొడవలు, సంతోషాలు, చివరకు బాధను కూడా స్టేటస్‌ల రూపంలో ప్రపంచానికి చెప్పేస్తున్నారు. ఎప్పుడు లేచాం, ఎక్కడికి వెళుతున్నాం, ఏం ధరించాం, ఆఫీసులో జరిగే టింగ్స్ దగ్గర నుంచి ఇంట్లో చేసే వంటకాలు, చిన్న చిన్న పనుల వరకు ప్రతి దానిని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టేస్తుంటారు చాలా మంది. ప్రతి విషయాన్ని అందులో పెట్టడం ప్రస్తుత కాలంలో ట్రెండ్‌గా చాలా మంది ఫీల్ అవుతుంటారు. అయితే, ఇలా ప్రతి విషయాన్ని ఇతరులతో పంచుకోవడం వెనుక ఒక బలమైన మానసిక కారణం ఉందని నిపుణులు చెబుతున్నారు. అసలు మనుషులు ఎందుకు ఇలా ప్రతిదీ పోస్ట్ చేయడానికి ఇష్టపడుతున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. సోషల్ డియా యుగంలో మనిషికి తోటివారి నుంచి లభించే 'గుర్తింపు' ఒక వ్యసనంలా మారింది. ఏదైనా పోస్ట్ చేసినప్పుడు దానికి వచ్చే రిప్లైలు, వ్యూస్ చూసి మన మెదడులో డొపమైన్ అనే రసాయనం విడుదలవుతుంది. ఇది మనకు ఒక రకమైన తక్షణ సంతోషాన్ని ఇస్తుంది. అందుకే చాలామంది తాము ఎంత సంతోషంగా ఉన్నామో లేదా ఎంత బాధలో ఉన్నామో ఇతరులు చూడాలని, దానిపై స్పందించాలని కోరుకుంటారు. ఈ అటెన్షన్ సీకింగ్ ప్రవర్తనే అతిగా పోస్ట్ చేయడానికి ప్రధాన కారణం. చాలామంది తమ మనసులోని భావాలను నేరుగా పంచుకోవడానికి సరైన వ్యక్తులు లేనప్పుడు వాట్సాప్‌ను ఒక వేదికగా ఎంచుకుంటారు. తమ బాధను ఒక స్టేటస్‌గా పెట్టడం వల్ల ఎవరో ఒకరు "ఏమైంది?" అని అడుగుతారనే చిన్న ఆశ వారిలో ఉంటుంది. అంటే, తమ ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి ఇదొక డిజిటల్ ప్రయత్నం అన్నమాట. అయితే, ఈ అలవాటు మెల్లమెల్లగా మనశ్శాంతిని దూరం చేస్తుంది. ఇతరులు చూడలేదనో లేదా ఆశించిన స్పందన రాలేదనో మరింత కుంగిపోయే ప్రమాదం ఉంది. ప్రతి విషయాన్ని స్టేటస్‌లో పెట్టడం వల్ల వ్యక్తిగత జీవితం ఒక తెరిచిన పుస్తకంలా మారుతుంది. రు ఎక్కడ ఉన్నారు? ఎవరితో ఉన్నారు? ఏం తింటున్నారు? అనేది ఇతరులకు సులభంగా తెలిసిపోతుంది. దీనివల్ల సైబర్ నేరాలు పెరిగే అవకాశం ఉండటమే కాకుండా, పై ఇతరులకు ఒక రకమైన అభిప్రాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ఆఫీస్ సహచరులు లేదా బంధువుల మధ్య ఇమేజ్ దెబ్బతినే అవకాశం ఉంది. ప్రతి చిన్న గొడవను స్టేటస్‌లో పెట్టి పరోక్షంగా సెర్లు వేయడం వల్ల సంబంధాలు మరింత దెబ్బతింటాయి. జీవితాన్ని ఆస్వాదించడం

అంటే దాన్ని కెమెరాలో బంధించి స్టేటస్‌లో పెట్టడం కాదు, ఆ క్షణాన్ని మనస్ఫూర్తిగా అనుభవించడం. స్టేటస్‌లు పెట్టడం తప్పు కాదు, కానీ అది దైనందిన జీవితాన్ని శాసించే స్థాయికి వెళ్లకూడదు. ఫోన్ పక్కన పెట్టి ఎదురుగా ఉన్న మనుషులతో మాట్లాడటం, మనసు విప్పి చర్చించడం వల్ల కలిగే తృప్తి ఏ డిజిటల్ వ్యూస్‌లోనూ దొరకదు.

# ఆత్మహత్యలకు డిప్రెషన్ మాత్రమే కారణం కాదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆత్మహత్య అనగానే సాధారణంగా అందరూ అది మానసిక ఒత్తిడి లేదా డిప్రెషన్ వల్ల జరిగిందని భావిస్తారు. లేదంటే సమాజం, కుటుంబ పరిస్థితులు అనేక కారణాలు ఉన్నాయని అనుకుంటారు. అయితే, సూసైడ్ చేసుకోవాలనే ఆలోచనల వెనుక ఉన్న షాకింగ్ నిజాన్ని తాజా పరిశోధనలు బయటపెట్టాయి. సాధారణంగా ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే, వారు తీవ్రమైన మనస్తాపంలో ఉన్నారని లేదా డిప్రెషన్‌తో బాధపడుతున్నారని మనం అందరూ అనుకుంటాం. "అంత కష్టం ఏం వచ్చిందో" పాపం అని బాధపడతాం. కానీ, యూనివర్సిటీ ఆఫ్ ఉతా హెల్త్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన కేవలం మానసిక జబ్బుల వల్లే రాదని, దీనికి జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చని తేలింది. చాలా సందర్భాల్లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తులకు ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నట్లు రికార్డుల్లో ఉండదు. వారు అంతకుముందు ఎప్పుడూ డిప్రెషన్‌కు గురైనట్లు లేదా చికిత్స తీసుకున్నట్లు ఆధారాలు కనిపించవు. ఇలాంటి వారిపై పరిశోధకులు దృష్టిసారించారు. సుమారు 2,700 మందికి పైగా మరణించిన వ్యక్తుల జన్యువులను విశ్లేషించగా, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. మానసిక సమస్యలు ఉన్నవారిలో కనిపించే జన్యువుల కంటే, ఎలాంటి ముందస్తు

లక్షణాలు లేకుండా ఆత్మహత్య చేసుకున్న వారిలో జన్యువులు భిన్నంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అంటే, ఆత్మహత్య చేసుకునే ప్రమాదం అనేది డిప్రెషన్, యాంగ్జైటీ లేదా పీటీఎస్‌డీ వంటి సమస్యలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా కూడా పని చేయవచ్చు. ఇప్పటివరకు ఆత్మహత్యలను నివారించడానికి కేవలం డిప్రెషన్ తగ్గించే మందులు లేదా కౌన్సెలింగ్‌పైనే వైద్యులు ఆధారపడుతున్నారు. అయితే, కొంతమందిలో జన్యుపరంగానే ఈ రిస్క్ ఉన్నప్పుడు, దాన్ని గుర్తించడానికి వేరే మార్గాలు వెతకాల్సి ఉంటుందని ఈ స్టడీ చెబుతోంది. ఈ జెనెటిక్ రిస్క్ ఫ్యాక్టర్లను ముందుగానే గుర్తిస్తే, భవిష్యత్తులో ప్రాణాలు కాపాడేందుకు కొత్త రకమైన చికిత్సలు మరియు పరీక్షలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆత్మహత్య అనేది కేవలం ఒక వ్యక్తి బలహీనత కాదు. దాని వెనుక అంతుచిక్కని సైన్స్ దాగి ఉంది. ఈ కొత్త ఆవిష్కరణలు మానసిక ఆరోగ్య రంగంలో సరికొత్త మార్పులకు దారితీయవచ్చు.

# వాయు కాలుష్యంతో పుట్టబోయే బిడ్డ మెదడుపై కూడా ప్రభావం



**హైదరాబాద్ పెన్ పవర్:** వాయు కాలుష్యం కేవలం పెద్దలకే కాదు, గర్భంలో ఉన్న శిశువుల మెదడుపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గర్భిణులు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, బ్లాక్ కార్బన్ వంటి కణాలు బిడ్డ మెదడు ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయి. ఐక్యూ తగ్గడం, ఆటిజం వంటి న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కరోనా తర్వాత భారతదేశానికి ఎదురవుతున్న అతిపెద్ద ప్రమాదం వాయు కాలుష్యం అని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల సమస్యలే కాకుండా కళ్లు, గుండెతోపాటు మొత్తం శరీరానికి పెను ప్రమాదంగా మారుతుందని పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రంగా వాయు కాలుష్యం మన భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుందని పరిశోధకులు అంటున్నారు. ఢిల్లీ ఆస్పత్రిలో 20 నుంచి 30% వరకు ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేషెంట్లే ఎక్కువగా ఉన్నారని లెక్కలు చెబుతుండటం.. దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. అయితే.. ఈ వాయు కాలుష్యం వల్ల భూమిపైన జీవిస్తున్న మనకే కాకుండా.. భూమిపై అడుగు పెట్టబోయే పుట్టబోయే బిడ్డ మెదడును కూడా దెబ్బతీస్తుందని తాజా రిపోర్ట్స్ చెబుతున్నాయి. గర్భంతో ఉన్న మహిళలు వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టీకులేట్ మేటర్ బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు గర్భంలో ఉన్న శిశువు మెదడుకు ప్రమాదంగా మారాయి. గర్భధారణ సమయంలో హెయిర్ పొల్యూషన్ బారిన మహిళలు పడడం వల్ల అభివృద్ధి చెందుతున్న శిశువు మెదడు ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని లాండ్ సెట్ ప్లానిటరీ హెల్త్ జర్నల్ లో పబ్లిష్ అయిన ఒక అధ్యయనం పేర్కొంది. రెండు లేదా మూడు నెలల ప్రెగ్నెన్సీ సమయంలో ఈ ప్రభావం అధికంగా ఉండవచ్చని తెలిపింది. బార్సిలోనా లైఫ్ స్టడీ కోహట్ ఆధారంగా 754 గర్భిణీలపై వాయు కాలుష్య ప్రభావాలను పరిశోధకులు స్టడీ చేయగా స్పెషలైజ్డ్ అల్ట్రాసౌండ్ ద్వారా ఫీటల్ బ్రెయిన్ స్ట్రక్చర్లను విశ్లేషించారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టిక్యూలేట్ మ్యాటర్, బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు శిశువు మెదడుపై ప్రభావం చూపుతాయని వైద్యులు అంటున్నారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యం ప్రభావానికి గురైతే బిడ్డ మెదడు అభివృద్ధిపై ప్రభావంతో పాటు పుట్టిన తర్వాత ఐక్యూ లెవెల్ తగ్గే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. దీంతోపాటు ఆటిజం వంటి న్యూరో డెవలప్మెంటల్ సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు డాక్టర్ జి.లతా ఎంబిబిఎస్, ఎండి.. వాయు కాలుష్యం వల్ల గర్భిణీ స్త్రీ ముందస్తు ప్రసవం అయ్యే ప్రమాదంతో పాటు ఆ సమయంలో పుట్టిన బిడ్డ మెదడు పూర్తిగా అభివృద్ధి కాకపోవడం.. అలాగే.. పలు అనారోగ్య సమస్యలు పెంచే అవకాశం ఉందని అంటున్నారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాన్ని పూర్తిగా అవాయిడ్ చేస్తే.. కొంత బెటర్ అని వైద్యులు సూచిస్తున్నారు.

# పాప్‌కార్న్‌ను ఇలా తిన్నారనుకోండి!



**హైదరాబాద్ పెన్ పవర్:** పాప్‌కార్న్‌ను సరైన పద్ధతిలో తినకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు అంటున్నారు. పాప్‌కార్న్‌లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని.. అది జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని.. కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుందన్నారు. పాప్‌కార్న్.. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టపడి తినే స్నాక్. సరైన పద్ధతిలో దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని.. అలాగే మార్కెట్‌లో దొరికే వివిధ రకాల ఫ్లేవర్డ్ పాప్‌కార్న్‌ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. అవి ఆరోగ్యానికి హానికరం అని చెప్పారు. పోషకాహార నిపుణుల ఇలా అన్నారు.. ఎలాంటి కృత్రిమ రుచులు, అధిక ఉప్పు లేదా వెన్న లేని సాదా పాప్‌కార్న్ మన శరీరానికి ముఖ్యమైన పోషకాలు అందిస్తుంది. పాప్‌కార్న్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రేగు కదలికలను పెంచి, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. పాప్‌కార్న్‌లో ఉండే ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్(ఒఆఒ) స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి మంచిది, హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అటు ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో దోహదపడుతుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఒక చక్కటి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. పాప్‌కార్న్‌లో పాలీఫినాల్స్ లాంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్‌ను నశింపజేసేలా చేస్తాయి. తద్వారా క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. యాంటీఆక్సిడెంట్ల సమృద్ధి వృద్ధాప్య ప్రక్రియను ఆలస్యం చేయడంలో సహాయపడుతుంది. ఇది చర్మం ముడతలు పడటం, అల్జీమర్స్, జుట్టు రాలడం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా దోహదపడుతుంది. పాప్‌కార్న్‌లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇది ఫైబర్ కారణంగా కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. త్వరగా ఆకలి వేయకుండా చేస్తుంది. దీని వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి స్నాక్. పాప్‌కార్న్ సహజంగా గ్లూటెన్ రహితమైనది. గ్లూటెన్ అలర్జీ ఉన్నవారు లేదా గ్లూటెన్ రహిత ఆహారాన్ని ఇష్టపడేవారికి ఇది మంచి ఆప్షన్.


# చికెన్, మటన్ లివర్ ఏది డేంజర్!





**హైదరాబాద్ పెన్ పవర్:** చికెన్, మటన్ లివర్ రెండూ పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలు. అయితే, వీటిలో ఇనుము, విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, కొందరికి ఆరోగ్యపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. కిడ్నీలో రాళ్లు, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు వీటిని తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నాన్ వెజ్ ప్రియులకు వారానికి ఒక రోజు మాంసం తినే అలవాటు సర్వసాధారణం. ఈ క్రమంలోనే చికెన్ లివర్, మటన్ లివర్‌లను ఎక్కువగా తింటుంటారు. ఈ రెండు ఆహార పదార్థాలలో అనేక పోషకాలు దాగున్నాయి. అందుకే మాంసాహారం ఇష్టపడే చాలామంది చికెన్, మటన్ లివర్‌ను ఇష్టంగా తింటారు. అయితే, వీటిలో ఆరోగ్యానికి ఏది మంచిది, ఎవరు వీటిని తినకూడదు అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందామా.. చికెన్ లివర్ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చికెన్ లివర్‌లో ఐరన్, సెలీనియం, విటమిన్ ఏ, బీ12, ఫోలేట్, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే సెలీనియం క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా, విటమిన్ ఏ, బీ12 కంటి ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి చక్కెర స్థాయిలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. ఉడికించిన చికెన్ లివర్‌ను మితంగా తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుందని చెబుతుంటారు. మటన్ లివర్ విషయానికి వస్తే.. చాలామంది చికెన్ లివర్ కంటే మటన్ లివర్ తినడానికి ఎక్కువ ఇష్టపడతారు. మటన్ లివర్‌లో విటమిన్లు ఏ, డీ, బీ12, జింక్, పొటాషియం, కాపర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి మటన్ లివర్ ఒక మంచి ఆహారం అని చెప్పొచ్చు. ఇది రక్త స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బీ12 శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తుంది. అయితే ఇన్ని పోషకాలు ఉన్న చికెన్, మటన్ లివర్‌ను కొందరు తినకూడదు. అలా తింటే లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు, అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు, గుండె జబ్బులతో బాధపడుతున్నవారు, గర్భిణీ స్త్రీలు చికెన్ లేదా మటన్ లివర్‌ను తినకూడదు. ఈ వ్యక్తులు తినడం వల్ల లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయి.

# గుండెపోటు లక్షణాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ అనేవి ఆకస్మిక మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, గుండెపోటు రావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి ముందుగా జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన గుండెపోటుకు 10 నుంచి 15 నిమిషాల ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, వాటిని గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రభావితం చేస్తున్న తీవ్రమైన వ్యాధి. చాలా సందర్భాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు పోతున్నాయి. మరికొందరైతే ఉన్నస్థలంలోనే కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ అనేవి ఇప్పుడు మనిషికి ప్రాణాంతకంగా మారాయి. అయితే, గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే శ్యామ్ బిహారీ లాల్ గుండెపోటుతో మరణించారు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు. అయితే, గుండెపోటుకు ముందు కనిపించిన లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆయన కొంత ముందుగా ఆస్పత్రికి రాలేకపోయారని, దీంతో తాము ఆయన ప్రాణాలు కాపాడలేకపోయామని వైద్యులు వెల్లడించారు. బిహారీ లాల్‌కు అకస్మాత్తుగా ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. అయితే, ఆయన దాన్ని తేలికగా తీసుకున్నారు. అందుకే ఆయన త్వరగా ఆస్పత్రికి రాలేదు. పరిస్థితి విషమించిన తర్వాత ఆస్పత్రిలో చేరారని, కొంత సమయానికే ఆయన మరణించారని వైద్య నివేదికలు పేర్కొన్నాయి. వైద్యుల ప్రకారం.. ప్రతి వ్యక్తికి గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ఆ లక్షణాలు 10 నుంచి 15 నిమిషాల ముందుగానే కనిపిస్తాయి. మరికొందరిలో 4-5 గంటల్లో కనిపిస్తాయి. గుండెలోని అడ్డంకులు రక్తం సరిగ్గా పంపింగ్ కాకుండా నిరోధిస్తున్నాయనడానికి ఇదొక హెచ్చరిక సంకేతం. ఈ పంపింగ్ సమస్య వచ్చిన వెంటనే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఛాతినొప్పి గుండెపోటుకు ప్రధాన సంకేతం. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చు. తీవ్రమైన ఛాతీ నొప్పిని విస్మరించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# నీ అవసరం జట్టుకు లేదు.. తప్పించడానికి కారణం లేకున్నా సీనియర్‌పై వేటు





**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డేల్లో అద్భుత గణాంకాలు.. పూర్తి ఫిట్ నెస్ తో ఉన్నానని నిరూపించుకున్నాడు.. ఫామ్ లేదంటే డొమెస్టిక్ క్రికెట్ లో సత్తా చాటాడు.. జట్టులో సీనియర్ పేసర్.. బోలెడంత అనుభవం.. టీమిండియాలో ఖచ్చితంగా ఉండడానికి అర్హుడు. అయినప్పటికీ న్యూజిలాండ్ తో జరగబోయే వన్డే సిరీస్ కు ఎంపిక చేయలేదు. ఇవన్నీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ గురించి చెబుతున్న

మాటలు. టీమిండియా ఫాస్ట్ బౌలర్ గా భారత జట్టులో తన మార్క్ వేసిన వేసిన షమీకి ప్రస్తుతం కష్టకాలం నడుస్తోంది. షమీ ఎంత బాగా బౌలింగ్ చేసినా సెలక్టర్లు భారత జట్టుకు తన అవసరం లేదని చెప్పేస్తున్నారు.బుమ్రాకు రెస్ట్ ఇవ్వడం.. అదే సమయంలో విజయ్ హజారే ట్రోఫీలు షమీ సత్తా చాటడంతో ఈ స్టార్ బౌలర్ రీ ఎంట్రీ ఖాయమనుకున్నారు. అయితే సెలక్టర్లు షమీకి మరోసారి మొండి చెయ్యి చూపించారు. మరోవైపు సిరాజ్ ను సెలక్ట్ చేసినా షమీకి మాత్రం చెక్ పెట్టారు. షమీని ఎంపిక చేయకపోవడానికి కారణం కూడా లేదు. బహుశా 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళికల్లో ఈ బెంగాల్ పేసర్ లేకపోవచ్చు. 35 ఏళ్ళ షమీ ఎప్పుడు గాయపడతాడో తెలియదు. ఫిట్ నెస్ కాపాడుకొని 2027 వన్డే వరల్డ్ కప్ వరకు కొనసాగడం కష్టమే. దీంతో షమీని సెలక్టర్లు పక్కనే పెట్టేస్తున్నారు.

**ఐపీఎల్ లో ఘోరంగా విఫలం:**

వాస్తవానికి ఐపీఎల్ లో ఘోరంగా విఫలం కావడం షమీ కెరీర్ పై ప్రతికూల ప్రభావం చూపించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున 9 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. అప్పటికే ఫిట్‌నెస్, ఫామ్ తో ఇబ్బందిపడిన షమీకి ఇంగ్లాండ్ తో 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు చోటు దక్కలేదు. ఆ తర్వాత ఆస్ట్రేలియా ఏ సిరీస్ లోనూ ఇండియా ఏ జట్టులో స్థానం దక్కలేదు. ఆ తర్వాత ముగిసిన దులీప్ ట్రోఫీలోనూ కేవలం ఒక వికెట్ మాత్రమే తీసుకొని నిరాశపరిచాడు. ఓవరాల్ గా షమీ అంతర్జాతీయ కెరీర్ ముగిసినట్టుగానే కనిపిస్తుంది.

**చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ:**

35 ఏళ్ల షమీ ఐపీఎల్ లో పేలవ ప్రదర్శన తర్వాత గాయపడ్డాడు. ఆ తర్వాత పూర్తి ఫిట్ నెస్ సాధించి రంజీ ట్రోఫీలో

అద్భుతంగా రాణించాడు. నాలుగు మ్యాచ్ ల్లో 20 వికెట్లు పడగొట్టి ఫామ్ లోకి వచ్చాడు. ఆ తర్వాత టీ20 ఫార్మట్ లో జరిగిన సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలోనూ రాణించాడు. ఏడు మ్యాచ్‌ల్లో 14.93 సగటుతో 16 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో ఐదు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

**న్యూజిలాండ్ తో సిరీస్ కు భారత వన్డే జట్టు**

శుభమాన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, యశస్వి జైస్వాల్

# కేకేఆర్ నుంచి ముస్తాఫిజుర్ ఔట్.. అధికారికంగా ప్రకటించిన కోల్‌కతా నైట్ రైడర్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంఛైజీ కీలక నిర్ణయం తీసుకుంది. బీసీసీఐ ఆదేశాల మేరకు బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను జట్టు నుంచి రిలీజ్ చేసింది. ఈ మేరకు శనివారం (జనవరి 3) కేకేఆర్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్‌కు ముందు బంగ్లాదేశ్ ప్లేయర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి తప్పించాలని బీసీసీఐ ఆదేశించింది. బీసీసీఐ ఆదేశం మేరకు అతడిని స్క్వాడ్ నుంచి రిలీజ్ చేశాం. ఐపీఎల్ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంచుకుంటాం" అని కేకేఆర్ ప్రకటనలో పేర్కొంది. ముస్తాఫిజుర్ స్థానంలో రిచర్డ్ గ్లీసన్, ఫజల్హాక్ ఫారూఖీ, స్పెన్సర్ జాన్సన్ ఈ ముగ్గురిలో ఒకరిని జట్టులోకి తీసుకోవాలని భావిస్తోన్నట్లు సమాచారం.

అసలు ఏం జరిగిందంటే..?కోల్‌శ్రీకత్తా నైట్‌శ్రీరైడర్స్ టీం నుంచి బంగ్లాదేశ్ స్టార్ ముస్తఫిజుర్ రెహ్మాన్‌శ్రీను రిలీజ్ చేయాలని కేకేఆర్ యాజమాన్యాన్ని బీసీసీఐ ఆదేశించింది. ఇటీవల భారత పొరుగు దేశంలో బంగ్లాదేశ్‌శ్రీలో హిందువులపై అఘాయిత్యాలు పెరిగిపోవడంతో ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ క్రికెటర్‌శ్రీకు ఐపీఎల్‌శ్రీలో ఆడేందుకు అనుమతి ఇవ్వడం సమంజసం కాదని భావించి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

ముస్తాఫిజుర్ రెహ్మాన్‌శ్రీను వదిలేసుకున్న క్రమంలో రీప్లేస్‌శ్రీమెంట్‌కు కేకేఆర్‌కు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. 2026 ఐపీఎల్ సీజన్ కోసం జరిగిన మినీ వేలంలో రూ.2 కోట్ల బేస్ ప్రైస్‌తో ఆక్షన్‌లో నిలిచిన ముస్తఫిజుర్‌శ్రీను 9.20 కోట్లకు కేకేఆర్ జట్టు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మంచి ఫామ్‌లో ఉండటంతో ముస్తాఫిజుర్ కోసం చెన్నై, ఢిల్లీ జట్లుతో పోటీ పడి మరీ కేకేఆర్ దక్కించుకుంది. తద్వారా ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన బంగ్లా ప్లేయర్ గా ముస్తాఫిజుర్ నిలిచాడు. కానీ ఇరుదేశాల మధ్య చోటు చేసుకున్న పరిస్థితుల వల్ల అతడికి 2026 సీజన్ ఐపీఎల్ ఆడే అవకాశం లేకుండా పోయింది.

# ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రిలీజ్ చేసిన KKR.. రూ. 9.20 కోట్లు వాపసు వస్తుందా..?






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 మినీ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను రూ.9.20 కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. బీసీసీఐ ఆదేశాల మేరకు బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను జట్టు నుంచి రిలీజ్ చేసింది. ఈ మేరకు శనివారం (జనవరి 3) కేకేఆర్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌శ్రీలో హిందువులపై అఘాయిత్యాలు పేట్రేగిపోవడంతో భారత్, బంగ్లాదేశ్ మధ్య స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ బంగ్లా పేసర్ ను రిలీజ్ చేయాలని కేకేఆర్ యాజమాన్యాన్ని బీసీసీఐ ఆదేశించింది. ఈ కారణంగా ఈ బంగ్లా పేసర్ ను కేకేఆర్ రిలీజ్ చేసింది. ముస్తాఫిజుర్ ను రిలీజ్ చేయడంతో ఇప్పుడు అతని కోసం ఖర్చు చేసిన డబ్బు మొత్తం 9.20 కోట్ల పూర్తి వాపసును పొందే అవకాశం ఉందని లీగ్ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ రూల్స్ ప్రకారం దౌత్యపరమైన లేదా భద్రతాపరమైన కారణాల వల్ల ఒక ఆటగాడిని జట్టు నుండి ఉపసంహరించుకున్నప్పుడు ఫ్రాంచైజీ సాధారణంగా ఆ ఆటగాడి మొత్తం వేలం ధరను తిరిగి వారి పర్స్‌లో జమ చేసుకునే హక్కును కలిగి ఉంటుంది.రూ.9.2 కోట్ల రీ ఫండ్ కేకేఆర్ జట్టుకు లభించడంతో ఆ ధరకు నాణ్యమైన ఆటగాడిని ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో నియమించుకోవచ్చు. కేకేఆర్ ఖాతాలో రూ.9.20 కోట్లు జమ అవుతాయి. ముస్తాఫిజుర్ రెహ్మాన్‌శ్రీను వదిలేసుకున్న క్రమంలో రీప్లేస్‌శ్రీమెంట్‌కు కేకేఆర్‌కు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. 2026 ఐపీఎల్ సీజన్ కోసం జరిగిన మినీ వేలంలో రూ.2 కోట్ల బేస్ ప్రైస్‌తో ఆక్షన్‌లో నిలిచిన ముస్తఫిజుర్‌శ్రీను 9.20 కోట్లకు కేకేఆర్ జట్టు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మంచి ఫామ్‌లో ఉండటంతో ముస్తాఫిజుర్ కోసం చెన్నై, ఢిల్లీ జట్లుతో పోటీ పడి మరీ కేకేఆర్ దక్కించుకుంది. తద్వారా ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన బంగ్లా ప్లేయర్ గా ముస్తాఫిజుర్ నిలిచాడు. కానీ ఇరుదేశాల మధ్య చోటు చేసుకున్న పరిస్థితుల వల్ల అతడికి 2026 సీజన్ ఐపీఎల్ ఆడే అవకాశం లేకుండా పోయింది.

# వైట్ డ్రెస్‌లో ఫారియా మాయ



'జాతిరత్నాలు' సినిమాతో 'చిట్టి'గా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో గూడు కట్టుకున్న పొడుగు కాళ్ళ సుందరి ఫారియా అబ్దుల్లా. తన హైట్, గ్లామర్‌తో ఇండస్ట్రీలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, వెండితెరపై కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువ యాక్టివ్‌గా ఉంటారు. 2026 న్యూ ఇయర్ సందర్భంగా ఈ బ్యూటీ షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఈ లేటెస్ట్ ఫొటోషూట్?లో ఫారియా క్రీమ్ వైట్ కలర్ ఆఫ్ షోల్డర్ డిజైనర్ డ్రెస్?లో మెరిసిపోతున్నారు. ఈ డ్రెస్ కింది భాగంలో నలుపు రంగుతో వేసిన స్కెచ్ ఆర్ట్ డిజైన్ చాలా కొత్తగా, ఆర్టిస్టిక్?గా ఉంది. మోకాళ్ళ వరకు ఉండే ఈ ట్రెండీ అవుట్‌ఫిట్‌లో ఆమె లుక్ చాలా క్లాసీగా, అంతే స్టైలిష్‌గా కనిపిస్తోంది. స్టైలింగ్ విషయంలో ఫారియా ఎప్పుడూ కొత్తదనం చూపిస్తారు.ఈ లుక్?లో చెవులకు పెద్ద సైజు ముత్యాల కమ్మలు ధరించి రాయల్ లుక్?ను సొంతం చేసుకున్నారు. జుట్టును సగం పైకి కట్టి మిగిలిన కురులను భుజాలపైకి వదిలేసి ఆమె ఇచ్చిన ఫోజులు కుర్రాళ్ళను కట్టిపడేస్తున్నాయి. డ్రెస్?పై ఉన్న బ్లాక్ ప్రింట్‌కు మ్యాచింగ్?గా నల్లటి పాయింటెడ్ హీల్స్ ధరించి పర్ఫెక్ట్‌గా రెడీ అయ్యారు. ఫారియా కెరీర్ విషయానికి వస్తే, 2025 ఆమెకు అంతగా కలిసి రాలేదనే చెప్పాలి. 'మత్తు వదలరా 2', 'గుర్రం పాపిరెడ్డి' వంటి సినిమాల్లో నటించినా, అవి ఆమె కెరీర్ గ్రాఫ్‌ను పెంచలేకపోయాయి.సినిమాలైతే వచ్చాయి కానీ, స్టార్ హీరోయిన్ రేంజ్?ను మాత్రం అందుకోలేకపోయారు. ప్రస్తుతం ఆమె చేతిలో చెప్పుకోదగ్గ భారీ ప్రాజెక్టులేవీ లేవు. అయితే, 2026లో మాత్రం గట్టిగా కొట్టాలనే కసి ఆమెలో కనిపిస్తోంది. "హ్యాపీ న్యూ ఇయర్ మై ఫ్యామిలీ.. 2026లో దుమ్మురేపుదాం" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆమె ఆత్మవిశ్వాసాన్ని చూపిస్తోంది. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా తన గ్లామర్, టాలెంట్?తో ఫారియా ఈ ఏడాదైనా సాలిడ్ బ్రేక్ అందుకుంటుందేమో చూడాలి. ఆమెలోని ఈ కొత్త ఎనర్జీ చూస్తుంటే కచ్చితంగా బౌన్స్ బ్యాక్ అవుతుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# గందరగోళంలోకి నెట్టేసిన శ్రద్ధా

-సాహో- చిత్రంతో తెలుగు వారికి సుపరిచితమైన నటి శ్రద్ధా కపూర్. తనదైన అందం, నట ప్రతిభతో యువహృదయాలను గెలుచుకున్న ఈ బ్యూటీని ఆరాధించని బోయ్స్ లేరంటే అతిశయోక్తి కాదు. శ్రద్ధా ఇటీవల స్త్రీ2 లోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. హారర్ సినిమాలో శ్రద్ధా నటనకు మంచి మార్కులే పడ్డాయి. తదుపరి క్రిష్ 4లోను శ్రద్ధా కపూర్ నటించనుంది. ఇక శ్రద్ధా నిరంతర ఇన్ స్టా పోస్టులు ఇంటర్నెట్ లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. ఈ భామ తాజాగా పింక్ ఫ్రాక్ ధరించిన ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి, దాంతో పాటే ఒక కొటేషన్ కూడా ఇచ్చింది. --గులాబ్ అంటే గులాబీ, గులాబీలు ఎరుపు, ఎరుపు అంటే లాల్, కానీ గులాబీ అంటే పింక్? సరైన గందరగోళం-- అని ఒక కవితను రాసింది. అయితే ఈ కవిత్వం పాఠకుల్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. శ్రద్ధాను సోషల్ మీడియాల్లో అనుసరిస్తున్న లక్షలాది మంది కన్ఫ్యూజన్ లోకి వెళ్లిపోయారు. ఈ రంగు-పద విరుద్ధతను హైలైట్ చేసిన విధానం ఆకర్షణీయంగా ఉన్నా, శ్రద్ధా లోతైన పరిభాషను అర్థం చేసుకోవడం కుర్రాళ్ల వల్ల కాలేదు. -గులాబ్- అనే పువ్వుకు మూలం రోజ్. చాలా గులాబీలు ఎరుపు రంగులో ఉంటాయి... అని కూడా ఇందులో వివరంగా ఉంది. అయితే శ్రద్ధా విసిరిన పజిల్‌ను పూరించడానికి ప్రయత్నించిన అభిమానులు ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు. శ్రద్ధా 9.3 కోట్ల మంది ఫాలోవర్లతో భారతీయ చిత్రపరిశ్రమలో క్రేజీ హీరోయిన్ గా వెలిగిపోతోంది. ఈ పోస్ట్ చేసిన మొదటి 60 నిమిషాల్లోనే 10,000 కంటే ఎక్కువ కామెంట్లు వినిపించాయి.ఈ పోస్ట్ కి సోషల్ మీడియాల్లో ఫ్యాన్స్ ఛమత్కారంగా స్పందించారు. శ్రద్ధ మాత్రమే భాషా సంక్షోభాన్ని ఇంత సౌందర్యంగా కనిపించేలా చేయగలదు! అని ఒకరు రాసారు. చాలామంది ఆమె -స్త్రీ- వ్యక్తిత్వాన్ని ప్రస్తావించారు. గులాబీ-గులాబీ తర్కం కంటే ఓ -స్త్రీ- రహస్యాన్ని కనుగొనడం సులభం అని కొందరు సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తానికి శ్రద్ధా ఫజిల్ తాలూకా గందరగోళం నుంచి బయటపడటం ఎవరి వల్లా కాలేదు!



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965